


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక




సంపుటి: 5 సంచిక: 233, పేజీలు - 08

శనివారం, ఫిబ్రవరి 7, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

## నేటి నుంచే టీ20 వరల్డ్ కప్ ప్రారంభం

- వివాదాల నడుమ పదో టీ20 ప్రపంచకప్
- భారత్‌తో ఆడేందుకు నిరాకరించిన పాకిస్థాన్




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ప్రపంచకప్‌లు సాధారణంగా అట్టహాసంతో, సంబరాలతో ప్రారంభమవుతాయి. కానీ, శనివారం కొలంబో వేదికగా మొదలుకానున్న పదో ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచకప్ మాత్రం వివాదాల తుపానుతో ఆరంభమవుతోంది. మైదానంలో జరగబోయే అసలైన క్రికెట్ పోరు కన్నా, తెరవెనుక జరుగుతున్న పరిణామాలు ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. టోర్నమెంట్ నుంచి బంగ్లాదేశ్ తప్పుకోవడం, షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి 15న భారత్‌తో జరగాల్సిన మ్యాచ్ ఆడేందుకు పాకిస్థాన్ నిరాకరించడం వంటి పరిణామాలు ఈ మెగా ఈవెంట్‌పై నీలినీడలు కమ్ముకునేలా చేశాయి. అయినప్పటికీ, టీ20 ఫార్మాట్‌కే సొంతమైన శైలిలో ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రదర్శన ముందుకు సాగనుంది. ఈ వివాదాల మధ్య, క్రికెట్ ప్రపంచవ్యాప్తంగా ఎంతగా

2లో..

## కేసీఆర్‌ను అరెస్ట్ చేసే దమ్ము బీజేపీకి ఉందా.?

### - నిజామాబాద్‌లో సీఎం రేవంత్ ప్రశ్న

- బీజేపీ ఎంపీలను బీఆర్ఎస్ గెలిపించింది - కేసీఆర్, కేటీఆర్‌లను కిషన్ రెడ్డి కాపాడుతున్నారని విమర్శలు
- కిషన్ రెడ్డి కల్వకుంట్ల కిషన్ రావుగా మారిపోయారని ఎద్దేవా - కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ నాయకుల విషం
- బీఆర్ఎస్, బీజేపీలు చీకటి ఒప్పందం చేసుకున్నారు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) నిజామాబాద్ కార్పొరేషన్‌తో పాటు జిల్లాలోని ఏడు మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. నిజామాబాద్ జిల్లాకు ఉన్న ఘన చరిత్రను గుర్తు చేస్తూ మండవ వెంకటేశ్వరరావు, సుదర్శన్ రెడ్డి వంటి నిష్కళంక నేతలు ఇక్కడ పనిచేశారని కొనియాడారు. అయితే, పదేళ్ల కేసీఆర్ పాలనలో, పన్నెండేళ్ల మోదీ పాలనలో నిజామాబాద్ సమస్యలు పరిష్కారం కాకపోగా, నగరం చెత్తకుప్పగా మారిందని మండిపడ్డారు. నిజామాబాద్ రైతుల ఆత్మగౌరవ పోరాటం దేశానికే ఆదర్శమని, కాంగ్రెస్ కట్టిన ప్రాజెక్టుల వల్లే ఇక్కడ పంటలు పండుతున్నాయని ఆయన గుర్తు చేశారు. జిల్లా అభివృద్ధి కోసం ఇప్పటికే విద్యాసంస్థలకు రూ. 600 కోట్లు, మున్సిపాలిటీలకు రూ. 1045 కోట్లు మంజూరు చేశామని వెల్లడించారు.
బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్‌పై సీఎం తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రెండుసార్లు ఎంపీగా గెలిచినా నిజామాబాద్‌ను కనీసం స్మార్ట్ సిటీ పథకంలోకి ఎందుకు తీసుకురాలేకపోయారని ప్రశ్నించారు. గల్లీలో మోరీలు తీయాలన్నా మోదీ రావాలా అని ఎద్దేవా చేశారు. కేసీఆర్, హరీష్ రావులను

2లో..

## ఆమె తర్వాతే అమ్మ!

### - మైనర్ అబార్షన్‌పై సుప్రీంకోర్టు సంచలన తీర్పు



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) న్యాయవ్యవస్థ అంటే కేవలం చట్టాలు, సెక్షన్లు, శిక్షలే కాదు. మానవత్వాన్ని గుర్తు చేసే ప్రక్రియ కూడా అని చెప్పే కీలక తీర్పు వచ్చింది. మైనర్ జీవితాన్ని ఆమె కలలను, ఆమె మానసిస్థితిని పరిగణలోకి తీసుకొని స్వేచ్ఛను ప్రసాదించింది. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు అమ్మతనం కంటే ఆమెకు సహజ సిద్ధంగా లభించిన హక్కుల రక్షణకే సుప్రీంకోర్టు మొగ్గు చూపింది. 30 వారాల గర్భాన్ని తీసివేయడానికి అనుమతి ఇస్తూ శుక్రవారం నాడు సుప్రీంకోర్టు వెల్లడించిన తీర్పు ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఉజ్వల్ భూన్యాలతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించి ఇచ్చిన తీర్పు ప్రతి ఒక్కర్నీ కదిలించింది. ఒక మైనర్ బాలిక, తన శరీరంలో జరుగుతున్న మార్పులను కూడా అర్థం చేసుకోలేని స్థితి ఉన్నప్పుడు ఆమె ఇష్టానికి వ్యతిరేకంగా ఆమెను తల్లిగా మారాలని చట్టం బలవంతం చేయలేదని ధర్మాసనం స్పష్టం చేసింది. "ఒక మహిళను ముఖ్యంగా మైనర్‌ను ఆమె అనుమతి లేకుండా తల్లి అవ్వాలని బలవంతం చేయడం ఆమె ప్రాథమిక హక్కులను కాలరాయడమే" అని కోర్టు వ్యాఖ్యానించింది. ప్రెగ్నెన్సీని కొనసాగించడానికి

2లో..

## బలప్రదర్శన కాదు.. అభివృద్ధే ముఖ్యం

### - ఈ తరహా రాజకీయాన్ని ఎలా ఎదుర్కోవాలో నాకు తెలుసు

- రాయలసీమను ఉద్యాన హబ్‌గా మార్చి చూపిస్తామని వెల్లడి - గత ప్రభుత్వంలో పోలవరం డయాఫ్రామ్ వాల్ కొట్టుకుపోయిందని విమర్శ
- కల్తీ నెయ్యితో లడ్డూ ప్రసాదం తయారు చేయించారని ఆరోపణ - భవిష్యత్తులో విద్యుత్ ఛార్జీలు పెంచబోమని హామీ



అమరావతి (ప్రశ్న న్యూస్) వైసీపీ అధినేత జగన్ పరామర్శ యాత్రలపై సీఎం చంద్రబాబు ఎదురుదాడికి దిగారు. పరామర్శల పేరుతో గంటల తరబడి ట్రాఫిక్ ఆపి ప్రజలను ఇబ్బంది పెట్టడం, బలప్రదర్శనలతో రౌడీయిజం చేయడం వంటి రాజకీయాలు తన దగ్గర చెల్లవని, ఈ తరహా రాజకీయాన్ని ఎలా ఎదుర్కోవాలో తనకు బాగా తెలుసని అన్నారు. ప్రజా సమస్యలపై పోరాడకుండా కేవలం రాజకీయం కోసం బలప్రదర్శనలు చేయడం

2లో..

## రేవంత్ రెడ్డి ట్రాప్‌లో పడొద్దు

### - గులాబీ శ్రేణులకు కేటీఆర్ సూచన

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కేవలం తన వైఫల్యాలను హామీల అమలును కప్పిపుచ్చుకోవడానికి కీలకమైన మున్సిపల్ ఎన్నికల వేళ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తిట్ల దండకం అందుకున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రేవంత్ రెడ్డి తిట్ల ట్రాప్‌లో పడవద్దని తెలంగాణ సమాజానికి, గులాబీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తెలంగాణ గడ్డపై ప్రస్తుతం ఒక వికృతమైన రాజకీయ క్రీడ నడుస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పద్నాలుగేళ్ల సుదీర్ఘ పోరాటంతో, ఢిల్లీ పీఠాన్ని గడగడలాడించి స్వరాష్ట్ర స్వప్నాన్ని సాకారం చేసిన నాయకుడు కేసీఆర్ అని గుర్తు చేశారు. ఒక తండ్రిలా ఈ రాష్ట్రాన్ని అక్కున చేర్చుకుని, తెలంగాణను ప్రగతి బాటలో నడిపించిన శిల్పి ఆయనేనని కొనియాడారు. కేసీఆర్ ఎప్పుడూ బిరుదుల కోసం, సన్మానాల కోసం పాకులాడలేదని, తెలంగాణ ప్రజల శ్రేయస్సు,

2లో..



## మీకూ చేతకాకపోతే చెప్పండి

### - స్పీకర్ కు సుప్రీం ఫైనల్ వార్నింగ్





న్యూఢిల్లీ / హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో సంచలనం రేపుతున్న ఎమ్మెల్యేల ఫిరాయింపు అంశం సుప్రీంకోర్టు లో మరోసారి విచారణకు వచ్చింది. ఈ వ్యవహారంలో ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని గత విచారణలోనే సుప్రీంకోర్టు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు ఆదేశాలు జారీ చేయగా దానిపై శుక్రవారం విచారణ జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యేల పార్టీ మార్పుకు సంబంధించి స్పీకర్ తీసుకున్న నిర్ణయాలను తెలంగాణ ప్రభుత్వం తరఫున వాదనలు వినిపిస్తున్న అభిషేక్ మను సింఘ్వీ సుప్రీంకోర్టుకు వివరించారు. ఇక ఈ వ్యవహారంలో వాదనలు విన్న జస్టిస్ అగస్టీన్ జార్జ్, జస్టిస్ సంజయ్ కరోల్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం ముందు అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. ఎమ్మెల్యేల అనర్హతపై దాఖలైన పిటిషన్లను స్పీకర్ ప్రసాద్ కుమార్, ఇప్పటికే విచారణ

2లో..

## మీ అరాచకాన్ని నిలదీస్తే దాడులు చేస్తారా.?

### - జోగి రమేశ్ ను పరామర్శించిన జగన్



అమరావతి (ప్రశ్న న్యూస్) మాజీ మంత్రి జోగి రమేష్ ఇంట్లో దాడి జరిగిన ప్రాంతాన్ని వైసీపీ అధినేత జగన్ పరిశీలించారు. జోగి రమేశ్ తో పాటు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. పార్టీ అండగా ఉంటుందని భయపడాల్సిన అవసరం లేదన్నారు. పెట్రోల్ దాడి జరిగిన ప్రదేశాన్ని పార్టీ నేతలతో కలిసి పరిశీలించారు. పెట్రోల్ బాంబులతో దాడి చేసిన వీడియోలను జగన్ కు చూపించారు.ఆ తర్వాత మీడియాతో మాట్లాడిన జగన్ కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. అ?ంబటి ఇంట్లో కొనసాగించిన జంగిల్ రాజ్ పరంపరను జోగి రమేష్ విషయంలో కూడా కొనసాగించారని ఫైర్ అయ్యారు.

2లో..

## ప్రపంచ ఫిల్మ్ ఇండస్ట్రీ హబ్‌గా హైదరాబాద్

### - డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) వచ్చే ఉగాది రోజున గద్దర్ ఫిలిం అవార్డుల ఫంక్షన్ కార్యక్రమాన్ని న భూతో న భవిష్యత్తు అన్న విధంగా ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ నిర్వహించాలని ప్రపంచ ఫిలిం ఇండస్ట్రీ మొత్తం హైదరాబాద్ వైపు తిరిగి చూసేలా ఆ కార్యక్రమాన్ని నిర్వహించాలని అందుకు అవసరమైన

2లో..

## ఢిల్లీ నేతలను మోహరించి.. గల్లీల్లో జెండా పాతేందుకు వ్యూహం

### - మున్సిపల్ ఎన్నికలకు బీజేపీ మేనిఫెస్టో

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ మున్సిపల్ ఎన్నికలపై భారతీయ జనతా పార్టీ ప్రత్యేక దృష్టి సారించింది. పురపోరులో కమలనాథులు కదనరంగంలోకి దూకారు. మున్సిపాలిటీ ఎన్నికల్లో వీలైనన్ని ఎక్కువ స్థానాలు గెలిచేందుకు కమలం పార్టీ కసరత్తు చేస్తోంది. 60 శాతానికి పైగా మున్సిపాలిటీలు తమవే అంటోంది

2లో..



## కులం, ప్రాంతం వేరైనా మన ధర్మం ఒక్కటే

### - భక్తులు మౌనం వీడాలని పవన్ కల్యాణ్ పిలుపు!

అమరావతి (ప్రశ్న న్యూస్) తిరుమల లడ్డూ ప్రసాదం అపవిత్రం కావడం మొదలుకొని హిందూ దేవాలయాల పవిత్రతపై జరుగుతున్న దాడులను ఉదహరిస్తూ ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ భక్తులకు కీలకమైన పిలుపునిచ్చారు. ప్రతి భక్తుడికీ ఒక ధార్మిక బాధ్యత ఉంటుందని, దేవుడిపై కేవలం భక్తి ఉంటే సరిపోదని, ఆ భక్తికి రక్షణ కవచంగా నిలవాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన స్పష్టం చేశారు. మన ఆరాధ్య

2లో..



## బీసీ రిజర్వేషన్లకు బీఆర్ఎస్ వ్యతిరేకం

### - కవిత సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) బీఆర్ఎస్‌పై కవిత మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆ పార్టీ బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకమని అధికారికంగా ప్రకటించారని అభిప్రాయపడ్డారు. బీసీ రిజర్వేషన్లు వ్యతిరేకిస్తూ పోరాటం చేస్తున్న వారి నోటి కాడ ముద్ద లాక్కున్న బుట్టంగారి మాధవ రెడ్డికి టికెట్ ఇవ్వడంతో స్పష్టమైందన్నారు. ఆయనకు మున్సిపల్ ఎన్నికల బరిలో నిలబెట్టి తాము బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకమని బీఆర్ఎస్ రాజముద్ర

2లో..



# నేటి నుంచే టీ20 వరల్డ్ కప్ ప్రారంభం

విస్తరిస్తోందో చెప్పడానికి ఈ టోర్నమెంటే ఒక నిదర్శనం. ఈసారి ఏకంగా 20 జట్లు బరిలోకి దిగుతున్నాయి. ఇందులో సంప్రదాయ దిగ్గజాలతో పాటు, ఉత్సాహవంతులైన కొత్త జట్లు కూడా ఉన్నాయి. ముఖ్యంగా, ఫుట్‌బాల్‌కు ప్రసిద్ధి చెందిన ఇటలీ జట్టు ఈ ప్రపంచకప్‌తో అరంగేట్రం చేయడం అందరినీ ఆకర్షిస్తోంది. "కాటెనాసియో" అనే తమ డిఫెన్సివ్ వ్యూహాలతో ఫుట్‌బాల్‌లో పేరుగాంచిన ఒక దేశం, ఇప్పుడు క్రికెట్ ప్రపంచకప్‌కు అర్హత సాధించడం క్రీడా పటంలో వస్తున్న మార్పులకు సంకేతం.డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతున్న భారత జట్టు, కేవలం టైటిల్ నిలబెట్టుకోవడానికే కాకుండా చరిత్ర సృష్టించేందుకు పోటీ పడుతోంది. పురుషుల టీ20 ప్రపంచకప్ టైటిల్‌ను నిలబెట్టుకోవడం చాలా అరుదైన ఘనత. ఒకవేళ భారత్ ఈ ఘనత సాధిస్తే, ఈ తరం ఆటగాళ్ల వారసత్వం పొట్టి ఫార్మాట్‌లో సుస్థిరమవుతుంది. అంతేకాకుండా, సొంతగడ్డపై ప్రపంచకప్ గెలిచిన తొలి దేశంగా, మూడు టీ20 టైటిళ్లు సాధించిన ఏకైక జట్టుగా చరిత్ర సృష్టించాలని భారత్ ఆశిస్తోంది. స్టార్ ఆటగాళ్లే కాకుండా, బ్యాటింగ్, బౌలింగ్‌లో లోతు, సమతూకంతో భారత జట్టు పటిష్టంగా కనిపిస్తోంది.మరోవైపు, ప్రతి జట్టు ఒక కథతో ప్రపంచకప్‌కు వస్తే, పాకిస్థాన్ మాత్రం అనేక కథనాలతో అడుగుపెట్టింది. 2009లో ఛాంపియన్‌గా నిలిచిన పాక్, ఎప్పుడైనా అద్భుతాలు చేయగల సత్తా ఉన్న జట్టు. అయితే, భారత్‌తో గ్రూప్ మ్యాచ్ ఆడకూడదని తీసుకున్న నిర్ణయం, వారి ప్రయాణానికి రాజకీయ, భావోద్వేగపూరిత వాతావరణాన్ని జోడించింది. ఇక 2012, 2016లలో ఛాంపియన్లుగా నిలిచిన వెస్టిండీస్, తమదైన పవర్ హిట్టింగ్‌తో ఎప్పటిలాగే ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. ఈ కుదించిన ఫార్మాట్‌లో ఒక్క ఓటమి కూడా టోర్నీ గమనాన్ని మార్చేయగలదు. కొలంబోలో లైట్లు వెలిగి, సంగీతం హోరెత్తుతున్న వేళ ఈ ప్రపంచకప్ కేవలం ఒక క్రికెట్ టోర్నమెంట్‌గా కాకుండా, రాజకీయాలు, అభిరుచులు, కలల కలబోతగా ప్రారంభం కానుంది. టీ20 క్రికెట్‌లో ఎప్పుడు ఏం జరుగుతుందో ఊహించలేమన్నది మరోసారి నిరూపితం కావడం ఖాయం.

# కేసీఆర్‌ను అరెస్ట్ చేసే దమ్ము బీజేపీకి ఉందా.?

జైలులో పెడతామని ప్రగల్భాలు పలికే అర్వింద్, కాళేశ్వరం అవినీతిపై సీబీఐ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో సమాధానం చెప్పాలన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కల్వకుంట్ల కిషన్ రావుగా మారి కేసీఆర్‌ను కాపాడుతున్నారని, బీజేపీ–బీఆర్ఎస్ మధ్య ఉన్నది ఫెవికాల్ బంధం అని ఆరోపించారు. బీజేపీకి ఓటు వేసినా, బీఆర్ఎస్‌కు ఓటు వేసినా అది మూసీ నదిలో వేసినట్లేనని ఓటర్లను హెచ్చరించారు. తనను బీజేపీ నేతలు రేవంతుద్దీన్ అని పిలవడంపై సీఎం ఘాటుగా స్పందించారు. కులగణన చేసినందుకు రేవంత్ గౌడ్ అని, వర్గీకరణకు పరిష్కారం చూపినందుకు రేవంత్ మాదిగ అని, ముదిరాజ్, యాదవ, సిక్కు సోదరులకు అండగా ఉన్నందుకు ఆయా పేర్లతో పిలిచినా తాను సంతోషంగా స్వీకరిస్తానని చెప్పారు.

అన్ని మతాలను, కులాలను సమన్వయం చేసుకుంటూ తెలంగాణను నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ప్రకటించారు. మైనార్టీల సంక్షేమానికి కాంగ్రెస్ కట్టుబడి ఉందనడానికి షబ్బీర్ అలీ, అజారుద్దీన్ వంటి నేతలకు కల్పించిన పదవులే నిదర్శనమని పేర్కొన్నారు. తనను రేవంతుద్దీన్ అని పిలిచినా తనకు ఎలాంటి అభ్యంతర లేదని, అభివృద్ధి పథంలో ముందుకు సాగుతానని స్పష్టం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై ముఖ్యమంత్రి క్లారిటీ ఇచ్చారు. గత పదేళ్లలో లేని విధంగా లక్షలాది కొత్త రేషన్ కార్డులు, 50 లక్షల కుటుంబాలకు ఉచిత విద్యుత్, రూ. 500లకే గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు. ఇప్పటికే 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని, ధాన్యానికి రూ. 500 బోనస్ ఇస్తున్నామని గుర్తు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మరో 8 ఏళ్లు అధికారంలో ఉంటుందని, నిజామాబాద్‌కు ఎయిర్‌పోర్ట్ తీసుకువచ్చే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. గడిదకు గడ్డి వేసి ఆవు దగ్గర పాలు పిండలేమని, అభివృద్ధి జరగాలంటే కార్పొరేషన్లలో కాంగ్రెస్ అభ్యర్థులనే గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఆమె తర్వాతే అమ్మ!

ఆమె ఏ మాత్రం ఇష్టపడటం లేదని గుర్తించిన న్యాయమూర్తులు, ఆమె ఇష్టాన్ని గౌరవించాలని సూచించారు. ఈ విచారణలో మైనర్ తరపున వాదించిన న్యాయవాది వాదనలు కోర్టును ఆలోచింపజేశాయి. ఒక వేళ ఆ ప్రెగ్నెన్సీ కొనసాగి శిశువు జన్మిస్తే, పుట్టే బిడ్డతోపాటు ఆమె సమాజంలో చాలా వివక్ష ఎదుర్కోవాల్సి ఉంటుదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆమెపై పడే ముద్ర ఇద్దర్నీ జీవితాంతం వేధిస్తాయని న్యాయవాది వాదించారు. ఈ సామాజిక వివక్ష వల్ల ఆమెకు కలిగే వేదన ఆమె భవిష్యత్‌ను నాశనం చేస్తుందని పేర్కొన్నారు. ఈ వాదనతో ఏకీభవించిన సుప్రీంకోర్టు, బిడ్డకు జన్మనివ్వడం ఆమెకు ఇష్టం లేదని స్పష్టమైందని గుర్తించింది. అత్యాచారం ద్వారా లేదా పరస్పర అంగీకారం లైంగిక చర్య ద్వారా గర్భం దాల్చిందా అనే అంశం కంటే, ప్రస్తుతం ఆమె మానసిక స్థితి, ఇష్టం ఏంటనేది అత్యంత ప్రధానమని న్యాయస్థానం తేల్చి చెప్పింది.

### కఠినమే కాని తప్పదు

తీర్పు ఇచ్చే సమయంలో న్యాయమూర్తులు కూడా తీవ్రమైన భావోద్వేగానికి లోనయ్యారు. 30వారాలు అంటే దాదాపు ఒక ప్రాణం రూపుదిద్దుకున్న సమయం. అటువంటి స్థితిలో గర్భస్రావానికి అనుమతి ఇవ్వడం ధర్మాసనానికి కూడా పెను సవాలుగా మారింది. "ఈ ఉత్తర్వులు జారీ చేయడం మాకు కూడా చాలా కష్టమే. కానీ మనం ఏం చేయగలం. అని జస్టిస్ నాగరత్నం వాపోయారు. పుట్టబోయే బిడ్డ కూడా ఒక జీవితమేనని అయితే గర్భం మోస్తున్న బాలిక స్వయంగా ఇంకా భరించే స్థితిలో లేదని" వారు ఆవేదన వ్యక్తం చేశారు. మైనర్ 24 వారాలకు గర్భస్రావం చేయగలిగితే, 30 వారాలకు ఎందుకు చేయకూడదు అనే ప్రశ్నను సంధిస్తూనే ఆమె ఆ గర్భాన్ని వదులుకోవడానికి ఉన్నప్పుడు చట్టం అడ్డుపడలేదని వారు భావించారు.

### వైద్యులకు దిశానిర్దేశం

ఈ ప్రక్రియను అత్యంత సురక్షితంగా నిర్వహించే బాధ్యతను సుప్రీంకోర్టు ముంబైలోని జేజే ఆసుపత్రికి అప్పగించింది. వైద్యపరంగా అబార్షన్ చేయడానికి అనుమతిస్తూ ఆసుపత్రి వర్గాలు తగిన జాగ్రత్తలతో ఈ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించింది. వైద్యపరంగా ఏర్పాటు చేసిన పరిమితుల్లోనే ఈ మొత్తం వ్యవహారం జరగాలని కోర్టు స్పష్టం చేసింది. ఈ తీర్పు భారత్ న్యాయ చరిత్రలో మైలురాయిగా నిలిచిపోతుంది. చట్టం అనేది కేవలం శిక్షలకే కాదు, ఒక వ్యక్తి గౌరవప్రదంగా జీవించేందుకు అవసరమైన భరోసా కల్పించడానికి కూడా ఈ తీర్పు రుజువు చేస్తుంది. ఒక బాలికకు ఆమె జీవితంపై శరీరంపై పూర్తి హక్కు ఉందని సుప్రీంకోర్టు చాటి చెప్పడం ద్వారా సామాజిక కట్టుబాట్ల కంటే మానవ స్వయంప్రతిపత్తికే పెద్ద పీట వేసింది. ఈ తీర్పు ద్వారా చిన్నారికి మళ్లీ తన సాధారణ జీవితాన్ని గడిపే అవకాశం లభించిదని, ఆమె మనసుపై పడిన గాయాలను న్యాయస్థానం తుడిచి వేసిందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# బలప్రదర్శన కాదు.. అభివృద్ధే ముఖ్యం

సరికాదని, ఎన్నికల సమయంలో సత్తా చాటాలని ఆయన హితవు పలికారు. గతంలో కాన్వాయ్‌తో ఒకరి మరణానికి కారణమవ్వడం, బంగారుపాళ్యంలో మామిడి రైతుల కాయలను తొక్కించడం వంటి చర్యలు వారి రౌడీయిజానికి నిదర్శనమని విమర్శించారు. కర్నూలు జిల్లా, ఎమ్మిగనూరు నియోజకవర్గం, కలుగట్లలో మీ భూమి– మీ హక్కు కార్యక్రమంలో సీఎం చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను అందించారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి సీఎం ప్రసంగించారు.గత ఐదేళ్ల పాలనలో శ్రీవేంకటేశ్వర స్వామి ప్రతిష్ఠను దెబ్బతీసేలా కల్తీ ప్రసాదంతో టీటీడీని అపవిత్రం చేశారని చంద్రబాబు తీవ్ర ఆరోపణలు చేశారు. బాత్రూంలు శుభ్రపరిచే రసాయనాలతో తయారుచేసిన కల్తీ నెయ్యితో లడ్డూలు చేయించారని, దీనిపై సీబీఐ, సిట్ క్లీన్‌చిట్ ఇచ్చిందని అబద్ధాలు చెబుతున్నారని అన్నారు. తాము ఇప్పుడు ఆ తప్పును సరిదిద్ది, నాణ్యమైన లడ్డూ ప్రసాదాన్ని అందిస్తున్నామని తెలిపారు. ఒకవైపు ప్రతిపక్ష రాజకీయ శైలిపై విమర్శలు గుప్పిస్తూనే, మరోవైపు తమ ప్రభుత్వ అభివృద్ధి అజెండాను, ముఖ్యంగా రాయలసీమ ప్రగతికి సంబంధించిన ప్రణాళికలను ఆయన వివరించారు. ఒకప్పుడు కరవుతో అల్లాడిన రాయలసీమను ఉద్యాన హబ్‌గా మారుస్తున్నామని, ఏటా 200 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తులు ఈ ప్రాంతం నుంచే వస్తున్నాయని చెప్పారు.

డ్రిప్ ఇరిగేషన్ వంటి సౌకర్యాలతో సీమకు నీరందించిన ఘనత తమ ప్రభుత్వానిదేనని అన్నారు. తాను రాయలసీమ బిడ్డనని, ఎన్టీఆర్ కూడా ఈ ప్రాంత ముద్దుబిడ్డేనని గుర్తుచేశారు.గత పాలకులు పోలవరాన్ని గోదాట్లో ముంచేశారని, డయాఫ్రామ్ వాల్ కొట్టుకుపోయేలా చేసి రూ.400 కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని విమర్శించారు. ఇప్పుడు తాము అదనంగా రూ.1000 కోట్లతో డయాఫ్రామ్ వాల్‌ను పునర్నిర్మిస్తున్నామని, గోదావరి పుష్కరాల నాటికి పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని హామీ ఇచ్చారు. పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు నీళ్లిచ్చి, శ్రీశైలం నీటిని రాయలసీమకు మళ్లించిన దూరదృష్టి తమదని పేర్కొన్నారు. రాయలసీమ లిఫ్ట్ పేరిట గత పాలకులు డ్రామాలు ఆడారని, అనుమతులు లేవని ఎన్జీటీ ఆపినా మళ్లీ నాటకాలు మొదలుపెట్టారని ఎద్దేవా చేశారు. తాము వెస్ట్ కర్నూలులో వేదవతి ప్రాజెక్టు, గురు రాఘవేంద్ర, రాజోలిబండ ప్రాజెక్టులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. గుండ్రేవుల ప్రాజెక్టుపై పొరుగు రాష్ట్రాలతో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. భవిష్యత్తులో విద్యుత్ ఛార్జీలు పెంచేది లేదని, ప్రజలపై ఎలాంటి భారం మోపబోమని ముఖ్యమంత్రి చంద్రబాబు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అనగాని సత్యప్రసాద్, నిమ్మల రామానాయుడు, టీజీ భరత్, ఎంపీ నాగరాజు, స్థానిక ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డి ట్రాప్‌లో పడొద్దు

సంక్షేమమే ఆయనకు నిజమైన సత్కారమని కేటీఆర్ స్పష్టం చేశారు.నేడు అధికార గర్వంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ప్రభుత్వ వైఫల్యాలను, అవినీతిని కప్పిపుచ్చుకోవడానికి కేసీఆర్ వ్యక్తిత్వంపై విషం చిమ్ముతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. ఇది కేవలం ఒక వ్యక్తి మీద జరుగుతున్న దాడి కాదని, తెలంగాణ ఉద్యమ చరిత్ర మీద జరుగుతున్న దాడి అని ఆయన అభివర్ణించారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా చర్చ జరగాల్సింది వార్డుల్లోని మౌలిక వసతులు, రోడ్లు, డ్రైనేజీ, ఇంటింటికీ అందాల్సిన పథకాల మీదనే కానీ, రేవంత్ రెడ్డి తన బూతు పురాణంతో అసలు చర్చను పక్కదోవ పట్టిస్తున్నారని దుయ్యబట్టారు. రేవంత్ రెడ్డి 'తిట్ల ట్రాప్'లో పార్టీ శ్రేణులు ఎవరూ పడకూడదని ఆయన హెచ్చరించారు.ప్రజల కన్నీటిని తుడిచే దిశగా బీఆర్ఎస్ పార్టీ పోరాటం సాగాలని, అబద్ధపు ఆరు గ్యారంటీల అమలుపై ప్రభుత్వాన్ని నిలదీయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఎరువుల కోసం క్యూ లైన్లలో రైతులు పడుతున్న పాట్లు, రైతు భరోసా అందక ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల కోరల్లో చిక్కుకున్న అన్నదాతల కష్టాల గురించి గొంతెత్తాలని సూచించారు. అలాగే ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక చదువులు ఆగిపోతున్న బిడ్డల వేదనకు, గురుకులాల్లో విషాహారం తిని అల్లాడిపోతున్న పసి ప్రాణాలకు రేవంత్ రెడ్డే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. వీటన్నింటిపై ఆయన్ని గల్లా పట్టి అడగాలని పార్టీ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం ఆఫీసుల చుట్టూ తిరుగుతున్న వృద్ధులు, డీఏలు, పీఆర్సీ లేక నలిగిపోతున్న ప్రభుత్వ ఉద్యోగుల పక్షాన నిలబడాలని పార్టీ నేతలకు కేటీఆర్ కోరారు. సింగరేణి బొగ్గు స్కామ్, విద్యుత్ కుంభకోణాల వెనుక ఉన్న అసలు దొంగలెవరో ప్రతి ఇంటికీ వెళ్లి వివరించాలని, తెలంగాణ నీటి వాటాను పక్క రాష్ట్రాలకు ధారాదత్తం చేస్తున్న రేవంత్ రెడ్డి ద్రోహాన్ని ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ప్రజల తీర్పే కేసీఆర్‌కి ఇచ్చే అసలైన గౌరవమని, పదేళ్ల ఉజ్వల ప్రగతి తర్వాత ఈ రెండేళ్లలో తెలంగాణ అనుభవిస్తున్న ఈ దుర్గతికి కారణాలను ప్రజల ముందుకు బలంగా తీసుకెళ్లాలని ఆయన సూచించారు.చివరగా, తెలంగాణ ప్రజల గుండెల్లో కేసీఆర్ ఒక ధ్రువతార అని, ఆయన కీర్తి నిరంతరం వెలుగులీనుతూనే ఉంటుందని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణకు ఇది ఒక గ్రహణ కాలమని, రేవంత్ అనే రాహువు నుంచి రాష్ట్రాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి బిడ్డపై ఉందని గుర్తుచేశారు. రేవంత్ రెడ్డి అసమర్థ పాలనపై మున్సిపల్ ఎన్నికల్లో ప్రశ్నలను పిడుగుల్లా కురిపించాలని, ప్రజాస్వామ్యాన్ని కంటికి రెప్పలా కాపాడుకుందామని ఆయన పిలుపునిచ్చారు.

# మీకూ చేతకాకపోతే చెప్పండి

చేస్తున్నట్లు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటివరకు పార్టీ మారినట్లు పేర్కొన్న 10 మంది ఎమ్మెల్యేల్లో 8 మందికి సంబంధించి స్పీకర్ క్లీన్‌చీట్ ఇచ్చినట్లు వెల్లడించారు. అయితే ఈ ప్రక్రియ పూర్తి చేసేందుకు ప్రభుత్వానికి మరింత సమయం పడుతుందని అందుకే మార్చి నెల మధ్య నాటికి సమయం ఇవ్వాలని ఈ సందర్భంగా అభిషేక్ మను సింఘ్వీ సుప్రీంకోర్టు ధర్మాసనానికి విజ్ఞప్తి చేశారు.అయితే మరోసారి గడువు ఇవ్వాలని కోరడం పట్ల బీఆర్ఎస్ పార్టీ తరఫున వాదనలు వినిపిస్తున్న లాయర్ మోహిత్‌రావు మిగిలిన ఇద్దరు ఎమ్మెల్యేల విషయంలోనే స్పష్టంగా ఆధారాలు ఉన్నాయని కోర్టుకు విన్నవించారు. ఆ ఇద్దరు ఎమ్మెల్యేలను స్పీకర్ విచారణ జరపడానికి ఇంకా ఏమీ లేదని పేర్కొన్నారు. ఆ ఇద్దరిలో ఒక ఎమ్మెల్యే బీఆర్ఎస్ పార్టీ తరఫున పోటీ చేసి గెలిచి కాంగ్రెస్ పార్టీ తరఫున ఎంపీగా పోటీ చేసినట్లు తెలిపారు. మొదట 4 వారాల్లో విచారణ పూర్తి చేస్తామని చెప్పి ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల పేరుతో మరోసారి సాకులు వెతుకుతున్నారని కోర్టుకు తెలిపారు. మరో బీఆర్ఎస్ ఎమ్మెల్యే కుమార్తె కాంగ్రెస్ పార్టీ ఎంపీగా పోటీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. బీఆర్ఎస్ పార్టీ తరఫున గెలిచిన ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీకి ప్రచారం చేశారని తెలిపారు. కానీ ఇప్పుడు మాత్రం ఆ ఎమ్మెల్యేలు అందరూ తాము ఇంకా బీఆర్ఎస్‌లోనే ఉన్నామని కాంగ్రెస్ పార్టీలో చేరలేదని చెబుతున్నారని కోర్టుకు తెలిపారు. ఇరు పక్షాల వాదనలు విన్న సుప్రీం ద్విసభ్య ధర్మాసనం ఈ కేసు తదుపరి విచారణను 3 వారాలకు వాయిదా వేస్తున్నట్లు వెల్లడించింది. ఆ గడువులోగా స్పీకర్ తన నిర్ణయాన్ని వెల్లడించకపోతే దాన్ని కోర్టు ధిక్కరణగా పరిగణించాల్సి వస్తుందని ధర్మాసనం పేర్కొంది. ఇరువురి వాదనలు విన్న ధర్మాసనం మూడు వారాల సమయం మాత్రమే ఇస్తూ విచారణను వాయిదా వేసింది. గతంలో ఇచ్చిన ఆదేశాలను స్పీకర్ పాటిస్తారని ఆశిస్తున్నట్లు సుప్రీంకోర్టు తెలిపింది. మూడు వారాల తర్వాత మళ్లీ విచారణ చేపడతామని పేర్కొంది. స్పీకర్ పాటించని పక్షంలో అప్పుడే ధిక్కరణ చర్యలపై ఆలోచిస్తామని వెల్లడించింది.

# మీ అరాచకాన్ని నిలదీస్తే దాడులు చేస్తారా.?

చంద్రబాబు జంగిల్ రాజ్ పాలనను చూసి.. నాగరిక ప్రపంచం తలదించుకుంటోందన్నారు. అంబటి రాంబాబు ఇంటిపై సాయంత్రం నుంచి అర్ధరాత్రివరకు దహనకాండను సాగించారని మరుసటి రోజు జోగి రమేష్ విషయంలోనూ అదే పరంపర కొనసాగిందన్నారు. "యాసిడ్,పెట్రోల్ బాంబులతో దాడి చేయడంతో మంటలకు జోగి రమేశ్ ఇంటి గోడ ఉబ్బింది. ఆ సమయంలో ఇంట్లో లేవలేని స్థితిలో జోగి రమేశ్ తండ్రి ఉన్నారు. ఇంట్లో ఫర్నిచర్, కర్టెన్స్ కి మంటలు అంటుకుని ఉంటే పరిస్థితి ఏంటి.? ఇది హత్యాయత్నం కాదా.?" అని వైఎస్ జగన్ ప్రశ్నించారు."చంద్రబాబు అబద్దాలను సీబీఐ సిట్ చార్జిషీట్ తేటతెల్లం చేసింది. తిరుమల లడ్డూ తయారీలో జంతువుల కొవ్వు కలవలేదు. చంద్రబాబుది అన్యాయమైన ప్రచారం. వెంకటేశ్వర స్వామి ప్రసాదం ప్రతిష్టను దిగజార్చిన వ్యక్తి చంద్రబాబే. వీరు సేకరించిన నమూనాలు చంద్రబాబు సీఎంగా ఉన్నప్పటివే. రాజకీయాల కోసం దేవుడిని వాడుకున్న వ్యక్తి ప్రపంచంలో చంద్రబాబు ఒక్కరే. భూమన, వైవీ సుబ్బారెడ్డి తప్పు చేయలేదని సిట్ నిర్ధారించింది. చంద్రబాబు లెంపలేసుకుని ప్రజలకు క్షమాపణ చెప్పాలి. ఫ్లెక్సీలతో చంద్రబాబు దుష్ప్రచారాలు చేస్తున్నారు. ప్రశ్నించిన మా నాయకులు అంబటి, జోగి తదితరులపై దాడి చేశారు. అసలు చంద్రబాబు, పవన్, లోకేష్ కు చిప్పే లేదు" అంటూ వైఎస్ జగన్ ఘాటైన వ్యాఖ్యలు చేశారు.

# ప్రపంచ ఫిల్మ్ ఇండస్ట్రీ హబ్‌గా హైదరాబాద్

అన్ని రకాల సహాయ సహకారాలను రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణంగా అందిస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శుక్రవారం సాయంత్రం ప్రసాద్ లాబ్స్ లో గద్దర్ ఫిలిం అవార్డుల సందర్భంగా సినిమాల స్క్రీనింగ్ ప్రక్రియ కార్యక్రమాన్ని డిప్యూటీ సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక మార్పు కోసం కలలను ఉపయోగించి, ప్రజల కోసం తన జీవితాన్ని ధారపోసిన మహానుభావుడు గద్దర్ అని ఆయన సేవలను డిప్యూటీ సీఎం కొనియాడారు. అందుకే ప్రజా ప్రభుత్వం ఆయన పేరిట సినిమా అవార్డులను ప్రారంభించింది ఇది రెండవ సంవత్సరం అని వివరించారు. వచ్చే ఉగాది పర్వదినం రోజు ఘనంగా గద్దర్ ఫిలిం అవార్డుల పంపిణీ కార్యక్రమం ఉంటుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు.

### ప్రపంచ సినీ కేంద్రంగా హైదరాబాద్

గద్దర్ చివరి రోజుల్లో వారితో తాను ఎక్కువ కాలం గడిపానని వారి స్టూడియోలో అనేక ప్రయోగాత్మక పాటలు పాడారని, చివరి రోజుల్లో గద్దర్ రికార్డింగ్ స్టూడియోలో ఎక్కువ రోజులు గడిపారని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క గుర్తు చేసుకున్నారు. తెలుగు సినీ పరిశ్రమలోని అన్ని విభాగాలకు అవార్డులను ఇవ్వబోతున్నట్లు తెలిపారు. హైదరాబాద్ కేవలం తెలుగు ఇండస్ట్రీకే కాదు భారతదేశంలోని వివిధ భాషలకు హైదరాబాద్ కేంద్రంగా మారాలని ప్రజా ప్రభుత్వం గొప్ప సంకల్పంతో పనిచేస్తుందని తెలిపారు. హైదరాబాద్ మహానగరంలో ఉండే వాతావరణ పరిస్థితులు, నిపుణులు, శాంతి భద్రతలు దేశంలోని మరే ఇతర నగరాల్లో లేవని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. హైదరాబాద్ మహానగరంలో ఉన్న సానుకూల వాతావరణాన్ని ఉపయోగించుకొని హైదరాబాదును ప్రపంచ సినీ కేంద్రంగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒక బ్లూ ప్రింట్ తయారు చేసుకుని ముందుకు పోతుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు.

### ఆస్కార్ స్థాయికి తెలుగు ఇండస్ట్రీ వెల్లడం గర్వంగా ఉంది

సినిమాల ద్వారా సామాజిక సందేశం ఇవ్వడంతో పాటు ఆర్థిక వనరులు సమకూరే అవకాశం ఉంటుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. తెలుగు సినిమా ఇండస్ట్రీ ఆస్కార్ వంటి ప్రపంచ స్థాయి అవార్డులను సాధించడం గర్వించదగిన అంశం అటువంటి అంశాలను పునాదిగా చేసుకుని హైదరాబాదును ప్రపంచ సినీ కేంద్రంగా మార్చాలని ఆలోచనల తో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ముందుకు పోతుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. సినిమా పరిశ్రమకు అవసరమైన ఆర్థిక, సామాజిక, శాంతిభద్రతలపరంగా ఇంకా ఎటువంటి అవసరం అయినా అర్ధరాత్రి తమ ప్రజా ప్రభుత్వం తలుపు తట్టవచ్చని మీకోసం సీఎం రేవంత్ రెడ్డి సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తోపాటు తాను అందుబాటులో ఉంటామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క భరోసా ఇచ్చారు.

### నిష్పక్షపాతంగా అవార్డులను ఎంపిక చేయాలి

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అందుబాటులో లేరు మీ అందరిని ప్రోత్సహించాలనేది మా అందరి ఏకైక లక్ష్యం అనే సందేశాన్ని మీ అందరికీ తెలియజేయవలసిందిగా తనకు తెలిపారని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వివరించారు. గద్దర్ ఫిలిం అవార్డుల కార్యక్రమాన్ని ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు మనస్ఫూర్తిగా తీసుకొని బాధ్యతాయుతంగా ముందుకు వెళ్తున్నారని డిప్యూటీ సీఎం అభినందించారు. సినీ కార్మికుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావడం, సినీ కార్మికుల కోసం, సినీ రంగం అభివృద్ధి కోసం ప్రభుత్వం ఎలాంటి కార్యక్రమాలు చేయాలని ఆలోచనలను సైతం దిల్ రాజు తమతో పంచుకుంటున్నారని డిప్యూటీ సీఎం వివరించారు. జూరీ చైర్మన్ మణిశర్మ తెలియని వారు సినీ రంగంలో లేరని, తరతమ బేధాలు లేకుండా, పారదర్శకంగా సినిమాలు చూడడమే కాదు నిష్పక్షపాతంగా అవార్డుల ఎంపిక కార్యక్రమాన్ని చేపట్టాలనీ చైర్మన్ తో పాటు జూరీ సభ్యులను కోరుతున్నట్టు డిప్యూటీ సీఎం తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్డిసి చైర్మన్ దిల్ రాజు, స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ మణిశర్మ, ఎఫ్డిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కిషోర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీ నేతలను మోహరించి.. గల్లీల్లో జెండా పాతేందుకు వ్యూహం

కమలం పార్టీ. ఈ నేపథ్యంలో రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు రాంచందర్ రావు మున్సిపల్ ఎన్నికల మేనిఫెస్టోను అధికారికంగా విడుదల చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలను రాజకీయంగా కీలకంగా భావిస్తున్న భారతీయ జనతా పార్టీ, ఈ ఎన్నికల ద్వారా ప్రజల్లో తన బలాన్ని చాటాలని వ్యూహాత్మకంగా ముందుకెళ్తోంది. ఎన్నికల మేనేజ్‌మెంట్‌లో తనదైన ముద్ర వేసేందుకు బీజేపీ జాతీయ నాయకత్వం ఇప్పటికే ప్రత్యేక బృందాలను రంగంలోకి దించింది. మున్సిపల్ ఎన్నికల ఇన్‌ఛార్జ్, మహారాష్ట్ర మంత్రి ఆశిష్ షెలార్‌తో పాటు కో–ఇన్ ఛార్జులు అశోక్ పర్నామి, రేఖాశర్మ ఇప్పటికే రాష్ట్రంలో మకాం వేశారు. క్షేత్రస్థాయిలో అభ్యర్థుల ఎంపిక నుంచి ప్రచార వ్యూహాల వరకు అన్నీ తానై చూస్తున్నారు షెలార్. గతంలో జీహెచ్ఎంసీ ఎన్నికలకు ఇన్‌ఛార్జ్‌గా పనిచేసిన షెలార్.. రాష్ట్ర నేతలకు దిశానిర్దేశం చేస్తున్నారు.కేవలం ప్రచారానికే పరిమితం కాకుండా కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టడమే లక్ష్యంగా బీజేపీ అస్త్రాలను సిద్ధం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేస్తోందంటూ ఇప్పటికే ఛార్జ్ షీట్ విడుదల చేసింది. కేంద్రం ఇచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులతోనే పట్టణాల్లో అభివృద్ధి సాధ్యమవుతోందని, రాష్ట్ర ప్రభుత్వం నిధులను పక్కదారి పట్టిస్తోందని కమలనాథులు అంటున్నారు. ఈ క్రమంలోనే మున్సిపల్ ఎన్నికల మేనిఫెస్టోను భారతీయ జనతా పార్టీ ప్రకటించింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలకు, కార్పొరేషన్లకు కీలక హామీలతో మేనిఫెస్టోను విడుదల చేశారు. ప్రధాన అంశాల్లో కోతులు, కుక్కల బెడద నివారణను చేర్చారు.తొలిసారి తెలంగాణలో అన్ని మున్సిపల్ వార్డుల్లో పోటీ చేస్తున్న బీజేపీ మెజారిటీ స్థానాల్లో కాషాయ జెండా ఎగురవేయాలని పార్టీ పట్టుదలతో ఉంది. 60 శాతానికి పైగా మున్సిపాలిటీలు, కనీసం 5 కార్పొరేషన్లను దక్కించుకోవాలని టార్గెట్ పెట్టుకుంది. ఇందుకోసం స్థానిక ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కష్టపడుతున్నారు. బీజేపీ యువ మోర్చాకు ఈ ఎన్నికల్లో ప్రత్యేక టాస్క్ ఇచ్చారు. జెన్–జీ టార్గెట్‌గా ప్రచారంలో వినూత్న కార్యక్రమాలు చేపట్టాలని దిశానిర్దేశం చేశారు.

# కులం, ప్రాంతం వేరైనా మన ధర్మం ఒక్కటే

దైవాలను లేదా ధర్మాన్ని ఎవరైనా అవహేళన చేసినప్పుడు బాధపడుతూ మౌనంగా ఉండిపోవడం ఇకపై సరికాదని..తమ ఆగ్రహాన్ని గళమెత్తి చాటాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ మేరకు సోషల్ మీడియాలో ఇంగ్లిష్‌లో, హిందీలో పోస్టులు పెట్టారు.

### మన విడిపోయిన మన ఆరాధ్య దైవాలు ఒక్కటే

మనం కులాలు, భాషలు, ప్రాంతాలు లేదా వివిధ పద్ధతులతో విడిపోయి ఉండవచ్చు, కానీ మన ధర్మం, మన ఆరాధ్య దైవాలు ఒక్కటేనని పవన్ కల్యాణ్ గుర్తుచేశారు. ఎవరైనా ఉద్దేశపూర్వకంగా హిందూ ధర్మాన్ని , భక్తుల విశ్వాసాలను అవమానించినప్పుడు భక్తులు తమ ఆగ్రహాన్ని బహిరంగంగా నిరసించడం అత్యవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. మౌనంగా ఉండటం వల్ల హిందూ ధర్మం గొంతు బలహీనపడుతుందని, అందుకే ప్రతి భక్తుడు కేవలం ఆరాధకుడిగానే కాకుండా తన విశ్వాసానికి రక్షకుడు కావాలని ఆయన ఆకాంక్షించారు.

### ధర్మ పరిరక్షణ ఇతర మతాలకు వ్యతిరేకం కాదు

ధర్మ రక్షణ అంటే ఇతర మతాలకు వ్యతిరేకంగా ఉండటం కాదని పవన్ కల్యాణ్ చాలా స్పష్టంగా వివరించారు. ఎవరినీ అవమానించడం లేదా ఎవరిపైనో ద్వేషం పెంచుకోవడం హిందూ ధర్మం ఉద్దేశం కాదని, కేవలం మన ధర్మం గౌరవాన్ని, మర్యాదను కాపాడుకోవడం మాత్రమేనని ఆయన నొక్కి చెబుతున్నారు. సనాతన ధర్మం వసుధైవ కుటుంబకం అని బోధిస్తుందని, అయితే ఆ ధర్మాన్ని అగౌరవపరిచే వారి పట్ల మౌనంగా ఉండటం చేతకానితనం అవుతుందని ఆయన హెచ్చరించారు.

### ఏపీ పరిణామాలతో పవన్ మరింత దూకుడుగా ధర్మరక్షణ ఉద్యమం

ఈ మొత్తం వ్యవహారంలో పవన్ కల్యాణ్ రాజకీయాలకు అతీతంగా ధర్మ రక్షణ అనే అంశాన్ని ముందుకు తీసుకెళ్తున్నారు. గతాన్ని వదిలేసి ముందుకు వెళ్లే ధోరణిని పక్కనపెట్టి, వర్తమానంలో ధర్మం పట్ల జరుగుతున్న అన్యాయాలను ఎదిరించాలని ఆయన కోరుతున్నారు. ఇందుకోసం వారాహి సనాతన ధర్మ రక్షణ వింగ్ వంటి వేదికలను కూడా ఆయన సిద్ధం చేస్తున్నారు. భక్తిని సామాజిక బాధ్యతతో ముడిపెడుతూ ఆయన చేసిన ఈ ట్వీట్ వైరల్ అవుతోంది.

# బీసీ రిజర్వేషన్లకు బీఆర్ఎస్ వ్యతిరేకం

వేసి చెప్పిందన్నారు. అలా కాదనుకుంటే ఆ పార్టీ ప్రజలకు వివరణ ఇవ్వాల్సిన బాధ్యత ఉందని డిమాండ్ చేశారు. తెలంగాణ జాగృతి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కీలక విషయాలు వెల్లడించారు. బీసీలకు విద్య, ఉపాధి, రాజకీయాల్లో 42 శాతం రిజర్వేషన్ల కోసం జాగృతి సహా బీసీ సంఘాలన్నీ పోరాటం చేస్తున్నాయని గుర్తు చేశారు. ఎన్నో రోజులు పోరాటం చేసి, ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి 42 శాతం రిజర్వేషన్ల బిల్లు వచ్చేలా చేశామని వివరించారు. కానీ బుట్టంగారి మాధవ్ రెడ్డి సహా మరొక వ్యక్తి దీనిపై పిటిషన్ వేశారని గుర్తు చేశారు. అలాంటి వ్యక్తికి ఇప్పుడు బీఆర్ఎస్ టికెట్ ఇచ్చిందని మండిపడ్డారు. అంటే ఈ కేసును బీఆర్ఎస్ వేయించిందా? బీసీల రిజర్వేషన్లకు బీఆర్ఎస్ వ్యతిరేకమా? అని ప్రశ్నించారు. ఈ మాధవ్ రెడ్డి అనే వ్యక్తి హరీష్ రావుకి చాలా దగ్గర వ్యక్తి అని తెలిపారు. హరీష్ రావు పర్సనల్ లాయర్ ఈ కేసు వేయించారని ఆరోపించారు. అప్పుడు దీని వెనుక ఉన్నది హరీష్ మాత్రమే అని విమర్శించారు. కానీ ఇప్పుడు బీఆర్ఎస్ ఆయనకు టికెట్ ఇవ్వటం కారణంగా దీని వెనుక బీఆర్ఎస్ మొత్తం ఉన్నట్లు అర్థమవుతోందన్నారు. తెలంగాణలో 56 శాతం ఉన్న బీసీల నోటికాడి బుక్క గుంజుకునే ప్రయత్నం చేసిన వ్యక్తికి టికెట్ ఎలా ఇస్తారని నిలదీశారు.బీఆర్ఎస్ అసలు బీసీల విషయంలో చిత్తశుద్ధితో లేదని ధ్వజమెత్తారు కవిత. పార్టీ పరంగా కూడా వాళ్లు మీటింగ్ పెట్టలేదన్నారు. బీసీ ప్రజాప్రతినిధుల ఫోరమ్ పేరుతో మాత్రమే మీటింగ్‌లు పెట్టారని తెలిపారు. జనగణనన విషయంలో కూడా ముందు కన్‌ఫ్యూజ్ చేశారని, తర్వాత మళ్లీ జనగణన చేయాలంటూ డిమాండ్ చేశారన్నారు. బీసీల రిజర్వేషన్ల విషయంలో అంతా రోడ్లపైకి వస్తే కానీ వాళ్ల మీటింగ్ లు కార్యరూపం దాల్చలేదని వివరించారు. అందుకే బీసీలంతా కూడా బీఆర్ఎస్ పార్టీ వైఖరిని గమనించాలని కవిత విజ్ఞప్తి చేశారు. బుట్టంగారి మాధవ్ రెడ్డిని నాయకుడిని చేసింది జాగృతియేనని తెలిపారు. హరీష్ రావు ఆయనను తప్పుదోవ పట్టించి కేసు వేయించారని ఆరోపించారు. బీఆర్ఎస్ పరిస్థితి ఇలా ఉంటే కాంగ్రెస్ పార్టీ కూడా తక్కువ తినలేదని చెప్పుకొచ్చారు కవిత. బీఆర్ఎస్ పార్టీ గుర్తుపై గెలిచిన వారికి మునిసిపల్ ఎన్నికలకు ఇన్‌ఛార్జ్‌లు నియమించారని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే అరికపూడి గాంధీని నిజామాబాద్ కాంగ్రెస్ ఇంఛార్జ్ గా చేస్తే, ప్రకాశ్ గౌడ్, తెల్లం వెంకట్ రావును కూడా తమ పార్టీ ఇన్‌ఛార్జ్‌ల జాబితాలో చోటు కల్పించారని అన్నారు. వీళ్లంతా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలని స్పీకర్ ప్రకటిస్తే ఇప్పుడు కాంగ్రెస్ మాత్రం అందుకు భిన్నంగా నవ్విపోదురుగాక నాకేటీ సిగ్గు అన్నట్లుగా ఎన్నికల బాధ్యతలు అప్పగించిందని మండిపడ్డారు. రాహుల్ గాంధీ రాజ్యాంగాలు పట్టుకొని తిరగడం కాదని, కాంగ్రెస్‌లో ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలపై వేటు వేయాలని సూచించారు. ఇప్పటి వరకు పాలన చూసిన ప్రజలంతా తమతో కలిసి వస్తున్నారని కవిత అన్నారు. కొన్ని పార్టీలు కలిసి వచ్చాయని తెలిపారు. అందులో భాగంగానే మున్సిపల్ ఎన్నికల్లో జాగృతి తరపున సింహం గుర్తుపై కొందరు పోటీ చేస్తున్నారని వెల్లడించారు. ప్రశ్నించే తమలాంటి వాళ్లతోపాటు సీపీఎం, న్యూ డెమాక్రసీ, స్వతంత్ర అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరుతున్నారని వివరించారు. తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సభను ఈ నెల 12 న నిర్వహిస్తున్నామని, ఈ సభకు ఉద్యమకారులు, అమరుల కుటుంబ సభ్యులు, తెలంగాణ వాదులు హాజరుకావాలని ఆహ్వానించారు.ద

# తెలుగుదేశం పార్టీ వర్కింగ్ షాప్ శిక్షణ



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్ ) విజయవాడ మంగళగిరి తెలుగుదేశం పార్టీ కేంద్రాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఐటీ శాఖ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు అధ్యక్షతన నిర్వహిస్తున్న తెలుగుదేశం పార్టీ వర్కింగ్ షాప్ శిక్షణ తరగతులకు హాజరైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ జి నరసింహ యాదవ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వన్నెకుల క్షత్రియ డైరెక్టర్ మిన్నల రవి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ గిరిజన సలహా మండలి సభ్యులు ఎం సుబ్బయ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ విభాగ కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ ఉమేష్ రావు శ్రీకాళహస్తి పట్టణ తెలుగుదేశం పార్టీ కార నిర్వాహ కార్యదర్శి వజ్రం కిషోర్ శ్రీకాళహస్తి తొట్టంబేడు మండల సింగల్ బెడ్ అధ్యక్షులు భాస్కర్ ముదిరాజు తొట్టంబేడు మండల ప్రధాన కార్యదర్శి మనీ మరియు రాష్ట్ర నాయి బ్రాహ్మణ సంక్షేమ అధ్యక్షులు కోట చంద్రశేఖర్ తెలుగుదేశం పార్టీ యువత నాయకులు చందు తదితరులు పాల్గొనడం జరిగినది.

## యాసంగి పంటల నమోదుకు
# రైతులు సహకరించాలి



**పెద్దపల్లి** యాసంగి పంటల నమోదుకు రైతులు సహకరించాలని ఏఈఓ వినయ్ కుమార్ పేర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో పెద్దపల్లి ఏఈఓ వినయ్ కుమార్ రైతులు సాగు చేసిన పంటల నమోదును క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తూ నమోదు చేసుకుం టున్నారు. ఇందులో భాగంగా గత మూడు రోజులుగా ఆయా గ్రామాల్లో నమోదు కార్యక్రమం పూర్తి చేసుకోగా శుక్రవారం పట్టణనీలోని చందపల్లి పాత గ్రామ పంచాయతీ బస్తీ దవాఖాన వద్ద రైతులతో సమావేశం నిర్వహించి, దీని వల్ల రైతులకు కలిగే లాభాలు వివరించారు. అలాగే మక్క పంట వేసిన రైతులు, పంట ను మార్చిన రైతులు ఇంకా ఎవరైనా నమోదు ఉంటే వచ్చి చేసుకోవాలని ఆయన సూచించారు. అనంతరం ఆయన రైతులతో కలిసి పంటల నమోదుకు వెళ్లారు.

## పంటల రక్షణ పేరుతో
# విద్యుత్ ఫెన్సింగ్ ప్రాణాంతకం
### - విద్యుత్ ఎస్ ఈ గంగాధర్



**పెద్దపల్లి** :అడవి జంతువుల నుండి పంటల రక్షణ పేరుతో విద్యుత్ ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తే ప్రాణాంతకమని ఎట్టి పరిస్థితుల్లోనూ విద్యుత్ ఫెన్సింగ్ వేయవద్దని ఎన్పీడీసీఎల్ ఎస్ఈ గంగాధర్ హెచ్చరించారు. అ డవి జంతువుల నుంచి పంటలను కాపాడుకునేందు కు వరి పొలాలు, వ్యవసాయ భూముల చుట్టూ అక్రమంగా విద్యుత్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం వల్ల తీవ్రమైన విద్యుత్ ప్రమాదాలు సంభవి స్తున్నాయని పెద్దపల్లి సర్కిల్ సూపెరింటెండింగ్ ఇంజనీర్ గంగాధర్ తెలిపారు. ఈ ప్రమాదాల కారణంగా గతంలో అనేక చోట్ల రైతులు, వ్యవసాయ కూలీలు, అలాగే పశువులు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు చోటుచేసుకున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ లైన్లకు నేరుగా లేదా అనధికారికంగా వైర్లు అనుసంధానించి ఫెన్సింగ్ చేయడం పూర్తిగా చట్టవిరుద్ధమని, ఇది అత్యంత ప్రమాదకరమైందని స్పష్టం చేశారు. రాత్రి వేళల్లో ఈ ఫెన్సింగ్ మరింత ప్రమాద కరంగా మారి, పొలాల్లో పనిచేసే రైతులు, కూలీలు తెలియక తాకితే ప్రాణాంతక ప్రమాదాలకు దారి తీస్తుందని తెలిపారు. విద్యుత్ ఫెన్సింగ్ కారణంగా మనుషులకే కాకుండా, ఆవులు, ఎద్దులు, మేకలు వంటి పశువులు కూడా విద్యుదాఘాతానికి గురై మృత్యువాత పడుతున్నాయని ఎస్ఈ తెలిపారు. ఇది వారి కుటుంబాలకు తీరని నష్టం కలిగిస్తోందని పేర్కొన్నారు. అక్రమంగా విద్యుత్ ఫెన్సింగ్ ఏర్పాటు చేసిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించా రు. ముఖ్యంగా సోలార్ ఆధారిత ఫెన్సింగ్, గార్డింగ్, ఇతర సురక్షిత వ్యవసాయ పద్ధతులను వినియోగించు కోవాలని ఆయన సూచించా రు. ప్రజలు తమ పరిసరాల్లో ఎక్కడైనా అక్రమ విద్యుత్ ఫెన్సింగ్ ఉన్నట్లు గమనిస్తే వెంటనే సంబంధిత విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వాలని ఎస్ ఈ కోరారు. విద్యుత్ ప్రమాదాల నివారణ కు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు .

## గోపాలరావుపేటలో మహాశివరాత్రి
# జాతర పత్రిక ఆవిష్కరణ

**రామడుగు:** రామడుగు మండలం గోపాలరావుపేట గ్రామంలో మహాశివరాత్రి సందర్భంగా శివాలయం ఆవరణలో పత్రిక ఆవిష్కరణ చేశారు. ఈ ఆవిష్కరణలో ముఖ్య అతిథులు గ్రామ సర్పంచ్ ఎడవల్లి వనజ నరేందర్ రెడ్డి ఉప సర్పంచ్ బుర్ర నరేష్ గౌడ్ వారి ఆధ్వర్యంలో శుక్రవారం జాతర పత్రిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాశివరాత్రి జాతరలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని గ్రామ సర్పంచ్ కోరారు. ఈ పత్రిక ఆవిష్కరణలో గ్రామ సర్పంచ్ ఉప సర్పంచ్ ఉత్సవ కమిటీ అధ్యక్షులు డైరెక్టర్లు కమిటీ సభ్యులు పురోహితులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి ఉన్న సమయంలో
## కేసీఆర్ ఫామ్ హౌస్ కే పరిమితమయ్యారు

**మెదక్ జిల్లా** కాళేశ్వరం కాలువ ద్వారా బిఆర్ఎస్ లక్షల కోట్లు దోచుకుందంటూ మండిపడ్డారు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి.మెదక్ జిల్లా రామాయంపేటలో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి రఘునందన్ రావు భారీ బహిరంగ సభలో పాల్గొన్నారు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ ముఖ్యమంత్రి ఉన్న సమయంలో ఫామ్ హౌస్ కే పరిమితమయ్యారు ఎంపీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఆర్ఎస్ సీటు గెలవలేదని అన్నారు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ భూమి వికరించి డబ్బులు దోచుకుంటుందని మండిపడ్డారు. అనంతరం మెదక్ ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ సిద్దిపేట కోమటి చెరువును ఖర్చు చేసి అభివృద్ధి చేశారు రామాయణం దత్తత తీసుకొని మల్లెచెరువుకు 100 కోట్లు కూడా కేటాయించలేదు రామాయంపేట ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులను బిఆర్ఎస్ నాయకులు బెదిరింపులకు గురిచేస్తే ఊరుకునే ఊరుకునే ప్రసక్తి లేదని మండిపడ్డారు పద్మాదేవేందర్ రెడ్డి ఎమ్మెల్యేగా ఉండి రామాయంపేట ను ఏలాంటి అభివృద్ధి చేయలేదని మండిపడ్డారు.

## కోహీర్ లో మంత్రి అజారుద్దీన్ ఎన్నికల ప్రచారం

**సంగారెడ్డి జిల్లా** సంగారెడ్డి జిల్లా కోహీర్ పట్టణంలో మునిసిపల్ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ఎన్నికల ప్రచార ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారోద్దీన్, మాజీ మంత్రి డా. ఏ. చంద్రశేఖర్, రాష్ట్ర సెట్విన్ ఛైర్మెన్ గిరిధర్ రెడ్డి పాల్గొని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా మంత్రి మహమ్మద్ అజారోద్దీన్ మాట్లాడుతూ, నూతనంగా ఏర్పాటు అయిన కోహీర్ మునిసిపాలిటీలో కాంగ్రెస్ జెండా ఎగరవేసి, అన్ని వార్డులను కైవసం చేసుకొని పార్టీ విజయాన్ని కొనసాగించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఇంటింటికి తీసుకెళ్లాలని సూచించారు.

## ప్రభుత్వ ఉద్యోగం రావడంలేదని యువకుడి ఆత్మహత్య

**హన్మకొండ** ప్రభుత్వ ఉద్యోగం రాలేదని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. వ్యవసాయం చేసుకుని జీవిద్దామని భార్య సర్ది చెప్పినా వినకుండా ఆత్మహత్య చేసుకున్నాడు. హన్మకొండ జిల్లా వేలేరు మండలం షోడాషపల్లి గ్రామంలో బండారి కుమారస్వామి(32) నివసిస్తూ, పలు ప్రభుత్వ ఉద్యోగాల కోసం పరీక్షలు రాస్తున్నాడు.

ఎన్ని ఉద్యోగాలకు ప్రయత్నించినా ఫలితం లేదని భార్యతో చెప్పి బాధపడ్డాడు. ఉద్యోగం రాకపోయినా వ్యవసాయం చేసుకుని జీవిద్దామని భార్య చెప్పినా వినకుండా, మనస్తాపంతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తన భర్త మృతిపై ఎలాంటి అనుమానాలు లేవని, ప్రభుత్వ ఉద్యోగం రాలేదనే ఆత్మహత్య చేసుకున్నాడని కుమారస్వామి భార్య స్వప్న తెలిపింది.

# పులి కదలికలు
### - అప్రమత్తంగా వుండాలని అధికారులు హెచ్చరిక

**ఏలూరు** గురువారం (నిన్న) రాత్రి 10.30 గంటల వరకు థర్మల్ డ్రోన్లతో పులి లైవ్ లొకేషన్ కోసం గాలింపు చేపట్టినప్పటికీ పులి జాడలు లభించలేదని జిల్లా అటవీ అధికారి బి. ప్రభాకర రావు వెల్లడించారు. ప్రస్తుతం జి. ఎర్రం పాలెం గ్రామ అవుట్స్కర్ట్స్లో ఇటీవల పులి పాదముద్రలు లభించిన చివరి ప్రాంతంలో అధికారులు పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. పులి కదలికలపై సమాచారం అందే అవకాశం ఉందని తెలిపారు. పులి లైవ్ లొకేషన్ గుర్తించిన వెంటనే అదనపు పోలీస్ బలగాల సహాయం అవసరం అవుతుందని అటవీ అధికారులు సూచించారు కేసవరం పంచాయతీ పరిధిలో పోలీస్ బలగాలు ఇప్పటికే సిద్ధంగా ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు. పులి కదలికలు మండపేట నియోజకవర్గంలోని మండపేట మండలం వైపు వెళ్లే అవకాశం ఉన్నందున ఆయా ప్రాంతాల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రైతులు తమ ఆవులు, పశువులను ఇంటి వద్దనే ఉంచుకోవాలని, మేతకు బయటికి పంపవద్దని అధికారులు విజ్ఞప్తి చేశారు. పులి కదలికల నేపథ్యంలో అధికార యంత్రాంగం పూర్తిగా సిద్ధం చేయబడిందని తెలిపారు. ఇప్పటికే పూణే నుంచి ఒక నిపుణుల బృందం జిల్లాకు చేరుకోగా, నేడు మరో ప్రత్యేక బృందం జిల్లాకు చేరుకోనుంది. ప్రజలు ఎటువంటి పుకార్లు నమ్మవద్దని, అధికారిక సమాచారం మాత్రమే విశ్వసించాలని అధికారులు సూచించారు. ఎవరికైనా పులి జాడలు కనిపించినా లేదా అనుమానాస్పద కదలికలు గమనించినా, కుక్కల సమూహపు అరుపులు వినిపించినా, వెంటనే సమీప పోలీస్ లేదా రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు

# రాజధాని రైతులు త్యాగధనులు



అమరావతి బ్రాండ్ అంబాసిడర్ వైష్ణవికి ఘన సత్కారం రాజధాని నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులకు పాదపూజ చేసిన అంబుల వైష్ణవి, డాక్టర్ మనోజ్ తండ్రి, కుమార్తెలను ఘనంగా సన్మానించిన రాజధాని రైతులు ప్రజా రాజధాని నిర్మాణానికి భూములు ఇచ్చిన అన్నదాతలు త్యాగధనులని అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి కొనియాడారు. గురువారం ఆమె తండ్రి మనోజ్ తో కలిసి రాజధాని గ్రామం అనంతవరం కొండపై వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అనంతరం రాజధాని నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులు, మహిళలకు పాద పూజ చేసి సన్మానించారు. ప్రతి ఒక్కరూ అమరావతి నిర్మాణంలో భాగస్వాములు కావాలని వైష్ణవి సూచించారు. ఈ సందర్భంగా వైష్ణవి, డాక్టర్ మనోజ్ ను రాజధాని రైతులు ఘనంగా సన్మానించారు.

# జగ్గంపేటలో గంజాయి పట్టివేత

- రవాణా చేసే రీతిలో గంజాయి తరలిస్తున్న దుండగులు
- 162 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు.
- ఒడిస్సా రాష్ట్రం నుండి శ్రీ సత్య సాయి జిల్లాకు గంజాయిని తరలిస్తున్న దుండగులు.

కాకినాడ జిల్లా, జగ్గంపేట, జనసేన ప్రతినిధి, ఫిబ్రవరి 5: సరుకులను రవాణా చేసే రీతిలో గంజాయిని తరలిస్తున్న గూడ్స్ ఆటోను పట్టుకున్నట్లు డీఎస్పీ శ్రీహరి రాజు తెలిపారు.వాయిస్ ఓవర్: జగ్గంపేట సర్కిల్ కార్యాలయం వద్ద నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. ఒడిశా నుండి శ్రీ సత్యసాయి జిల్లాకు తరలిస్తున్న 162 కేజీల గంజాయిని జగ్గంపేట మండలం జె. కొత్తూరు వద్ద జగ్గంపేట ఎస్ఐ రఘునాథరావు, ఈగల్ వింగ్ టీమ్ పట్టుకున్నట్లు తెలిపారు. గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను, మహిళలను అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. అలాగే ఆటో, సెల్ ఫోన్లు, రూ. లక్ష నగదు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ. 82,48,750 ఉంటుందన్నారు. ఈ సమావేశంలో సిఐ వై అర్ కె శ్రీనివాస్, ఎస్ఐ, సిబ్బంది ఉన్నారు.

## జగ్గంపేట ఇర్రిపాకలో వెంకటేశ్వర కళ్యాణం

**జగ్గంపేట** దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు కళ్యాణ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు టీటీడీ బోర్డు సభ్యులు, జగ్గంపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తెలిపారు.జగ్గంపేట మండలం ఇర్రిపాకలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఇర్రిపాకలో ఉన్న శివాలయ, వెంకటేశ్వరస్వామి ఆలయాలను తిరుమల తిరుపతి దేవస్థానం దత్తత తీసుకుంటుందన్నారు. దత్తతను ఆమోదించిన సీఎం చంద్రబాబుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆలయాలను అప్పగించే ముందు కళ్యాణ మహోత్సవాలను నిర్వహించాలని సంకల్పించి 7 వ తేదీన టిటిడి ఆధ్వర్యంలో శ్రీనివాస కళ్యాణం, 8 వ తేదీన అన్నవరం సత్యనారాయణస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో సామూహిక వ్రతాలు, స్వామివారి కళ్యాణం నిర్వహించడం జరుగుతుందన్నారు. 9 వ తేదీన శ్రీశైలం మల్లిఖార్జున స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో శివపార్వతుల కళ్యాణం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, టిటిడి చైర్మన్ బి ఆర్ నాయుడు, బోర్డు మెంబర్లు, దేవాదాయ శాఖ అధికారులు రానున్నారని తెలిపారు.

## తెలంగాణ జనసేన నేతలతో పవన్ కళ్యాణ్ భేటి

**విజయవాడ** తెలంగాణ జనసేన నేతలతో అధినేత పవన్ కళ్యాణ్ సమావేశమయ్యారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారం సందర్భంగా సమావేశమైయారు. ఈ సందర్భంగా అయన పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేసారు. 7,8 తేదీల్లో జనసేన అభ్యర్థులకు, బీజేపీ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా ఎన్నికల ప్రచారంలో అయన పాల్గొంటారు. ఈ మున్సిపల్ ఎన్నికల్లో జనసేన 330 పైగా స్థానాల్లో పోటీ చేస్తుంది.

# రోడ్డు ప్రమాదంలో ఒకరు స్పాట్ డెడ్



**జనగామ్** జనగామ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. జనగామ పట్టణంలోని ఫ్లై ఓవర్ పై బొలెరో వాహనం,బైకు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో స్టేషన్ ఘనపూర్ మండలం ఇప్పగూడెం గ్రామానికి చెందిన నవీన్ అక్కడిక్కడే మృతి చెందాడు. జనగామ మండలం శామీర్ పేట కు చెందిన అభిలాష్ కు తీవ్ర గాయాలు కావడంతో జనగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అభిలాష్ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కొరకు వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు.

## క్రీడా పోటీలు ఆత్మవిశ్వాసం,
# క్రమశిక్షణను పెంపొందిస్తాయి

- బోయినిపల్లి ఎంపీడీఓ : భీమా జయశీల
- సీఎం కప్‌లో సత్తా చాటిన బోయినిపల్లి మండల క్రీడాకారులు
- కబడ్డీ, వాలీబాల్‌లో ద్విచక్ర విజయం - జిల్లాస్థాయికి 8 మంది ఎంపిక



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) చొప్పదండి నియోజకవర్గం స్థాయి సీఎం కప్ బాలుర క్రీడా పోటీలు శుక్రవారం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ పోటీల్లో కబడ్డీ,ఖోఖో, వాలీబాల్ క్రీడలు నిర్వహించగా, బోయినిపల్లి మండలం క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరిచారు. కబడ్డీ, వాలీబాల్ విభాగాల్లో బోయినిపల్లి మండలం జట్లు మొదటి స్థానాలు సాధించి ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నాయి. ఖోఖో పోటీల్లో కూడా క్రీడాకారులు పోటీగా ఆడి ప్రతిభను చాటారు. పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శన చేసిన ఎనిమిది మంది క్రీడాకారులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మొదటి స్థానంలో నిలిచిన జట్లను బోయినిపల్లి ఎంపీడీఓ భీమా జయశీల, జేసీ,ఎంఈఓ శ్రవణ్ కుమార్ అభినందించారు. జట్ల విజయానికి కీలకపాత్ర పోషించిన పీటీలు, పీడీలను ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా ఎంపీడీఓ జయశీల మాట్లాడుతూ, "గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల్లో క్రీడా ప్రతిభ అపారం. సీఎం కప్ వంటి పోటీలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణను పెంపొందిస్తాయి. జిల్లాస్థాయిలో కూడా బోయినిపల్లి మండల క్రీడాకారులు మెరుగైన ఫలితాలు సాధిస్తారని ఆశిస్తున్నాం" అని అన్నారు. బోయినిపల్లి మండలం క్రీడాకారుల విజయంపై స్థానికంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

## బాత్‌రూమ్‌క్లీన్ చేసే కెమికల్స్‌తో
# శ్రీవారి ప్రసాద లడ్డూ తయారీ
### - ఎన్డీడీబీ రిపోర్టే చెబుతోందన్న చంద్రబాబు



**అమరావతి (ప్రశ్న న్యూస్)** తిరుమల శ్రీవారి లడ్డూ కేసు విషయంలో మరోసారి ఏపీ సీఎం చంద్రబాబునాయుడు సంచలన వ్యాఖ్యలు చేశారు. బాత్‌రూమ్‌లు క్లీన్ చేసే కెమికల్స్ ను ఉపయోగించి వైసీపీ హయాంలో లడ్డూను తయారు చేశారని ఆరోపించారు. ఎన్డీడీబీ రిపోర్టు ఆధారంగానే తాను మాట్లాడుతున్నానన్నారు. కల్తీ జరిగిందని వైవీ సుబ్బారెడ్డి స్వయంగా చెప్పారని చంద్రబాబు గుర్తు చేశారు. వైసీపీ హయాంలోఐదేళ్లు ఆలయాలన్నింటిలోనూ కల్తీ నెయ్యినే ఉపయోగించి ప్రసాదాలు తయారు చేశారన్నారు. శ్రీశైలంలోనూ కల్తీ జరిగినట్లుగా తేలిందని చెప్పారు. కర్నూలు జిల్లాలో రైతులకు పాస్‌బుక్‌లు ఇచ్చే కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు.

కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం కలుగొట్ల గ్రామంలో నిర్వహించిన మీ భూమి – మీ హక్కు ' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ సంచలన వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో తిరుమల లడ్డూ తయారీ కోసం వాడిన నెయ్యిని బాత్రూమ్ క్లీన్ చేసే కెమికల్స్ తో తయారు చేశారని ఆయన ఆరోపించారు. అపరిశుభ్రమైన పద్ధతుల్లో, రసాయనాలు కలిపి తయారు చేసిన ఆ కల్తీ నెయ్యిని వాడి భక్తుల మనోభావాలను దెబ్బతీశారని విమర్శించారు. తాను చేస్తున్న ఈ ఆరోపణలు గాలిలో చేస్తున్నవి కావని, ఎన్డీడీబీ నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్ నివేదిక ఆధారంగానే ఈ విషయాలు చెబుతున్నానని స్పష్టం చేశారు. ఆధారాలు లేకుండా తాను ఎప్పుడూ మాట్లాడనని ఆయన స్పష్టం చేశారు.కేవలం తిరుమల మాత్రమే కాకుండా, శ్రీశైలం క్షేత్రంలోనూ ప్రసాదాల తయారీలో గత ప్రభుత్వం కల్తీ నెయ్యిని వాడిందని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాలన్నింటినీ గత ఐదేళ్లలో అపవిత్రం చేశారని అసహనం వ్యక్తం చేశారు. లడ్డూ కల్తీ విషయంలో సీబీఐ సిట్ క్లీన్ చిట్ ఇచ్చాయన్న వార్తలను ఆయన కొట్టిపారేశారు. సిట్ తన నివేదికలో కల్తీ జరిగినట్లు స్పష్టంగా పేర్కొందని, వైవీ సుబ్బారెడ్డి కూడా ఈ విషయాన్ని స్వయంగా చెప్పారని ఆయన గుర్తు చేశారు. వైసీపీ నేతలు మనుషులతోనే కాదు, దేవుడితో కూడా పెట్టుకున్నారని.. వేంకటేశ్వరస్వామిని అపవిత్రం చేసిన ఈ మహా పాపం ఊరికే పోదని, దోషులు కచ్చితంగా శిక్ష అనుభవిస్తారని హెచ్చరించారు.కల్తీ ప్రసాదంతో టీటీడీని అపవిత్రం చేస్తే దానిని సరిదిద్దే ప్రయత్నం చేశానని చంద్రబాబు తెలిపారు. గతంలో లడ్డూకి, ఇప్పుడు అందించే లడ్డూకు చాలా వ్యత్యాసం ఉంది. పరామర్శల పేరుతో గుంటూరు వెళ్లేందుకు 6 గంటలు పట్టేలా వ్యవహరించారు. మరే వాహనాలు వెళ్లకుండా వాహనదారులను ఇబ్బందులు పెట్టారు గతంలో కాన్వాయ్ కింద సింగయ్య అనే వ్యక్తిని తొక్కించేశారు. బంగారుపాళ్యంలో మామిడి కాయలను కిందపడేసి తొక్కించేసి రౌడీయిజం చేశారు. బలప్రదర్శన ఎన్నికల సమయంలో చేయాలి. ప్రజా సమస్యల కోసం పోరాడకుండా రాజకీయం కోసమే బలప్రదర్శన చేస్తున్నారు. ఈ తరహా రాజకీయాన్ని ఎదుర్కోవటం తనకు తెలుసని చంద్రబాబు అన్నారు.

# బెంగళూరు టూ చెన్నై....

**తిరుపతి,** ఏపీలో మరో కొత్త రైల్వే లైన్ పనులు చాలాకాలంగా నిలిచిపోయాయి. భూసేకరణ పూర్తి చేసినా సరే.. రైతులకు నష్టపరిహారం చెల్లించకపోవడంతో పనులు ఆగాయి. 15 ఏళ్ల క్రితం చిత్తూరు జిల్లా కుప్పం నుంచి కర్ణాటకలోని మారికుప్పం వరకు కొత్త రైల్వే ట్రాక్ ప్లాన్ చేశారు. కర్ణాటకలో పనులు వేగంగా జరుగుతుంటే.. ఏపీలో మాత్రం ఆగాయి. ఈ రైల్వే లైన్ పూర్తి చేస్తే మరిన్ని రైళ్లు నడిపే అవకాశం ఉంటుంది.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా కొత్త రైల్వే లైన్ ప్రాజెక్టులపై ఫోకస్ పెట్టింది. కేంద్రం సహకారంతో నిధులు తీసుకొచ్చి పనులు పరుగులు పెట్టిస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా ఆలస్యం అవుతున్న మరో కీలకమైన రైల్వే లైన్ పనులలో కీలక ముందడుగు పడింది. చిత్తూరు జిల్లాకు సంబంధించిన కుప్పం–మారికుప్పం (కర్ణాటక) కొత్త రైల్వే ట్రాక్ పనులు మరింత వేగవంతం చేశారు. ఈ రైల్వే లైన్ సమీపంలో 30 కిలో మీటర్లు వెళితే కర్ణాటక వస్తుంది.. ఇటు తమిళనాడు కూడా ఉంటుంది. కుప్పం రైల్వే స్టేషన్ కూడా చెన్నై–బెంగళూరు రైలు మార్గంలోనే ఉంది. ఈ స్టేషన్ మీదుగా రోజూ రైళ్లు పరుగులు తీస్తూనే ఉంటాయి. ఒక్కమాటలో చెప్పాలంటే కుప్పం రైల్వే స్టేషన్ మూడు రాష్ట్రాలకు సరిహద్దుగా ఉంది. అందుకే ఈ స్టేషన్‌ను ప్రస్తుతం అమృత్ భారత్‌లో భాగంగా అభివృద్ధి పనులు చేపట్టారు. ఇప్పుడు కుప్పం మారికుప్పం (కర్ణాటక) మధ్య కొత్త రైల్వేట్రాక్ పనులు పూర్తి చేసి.. త్వరగా అందుబాటులోకి తీసుకొస్తే ప్యాసింజర్ రైళ్ల సంఖ్య పెరుగుతుంది అంటున్నారు.2011లో 23.7 కి.మీ పొడవున కుప్పం–మారికుప్పం మధ్య కొత్తగా రైల్వే ట్రాక్ నిర్మాణం చేసేందుకు ప్రతిపాదనలు తెరపైకి వచ్చాయి. ఈ మేరకు అధికారులు భూసేకరణ కోసం ప్రతిపాదనల్లో భాగంగా.. గుడుపల్లె మండలం పరిధిలోన గ్రామాల్లో 238.50, కుప్పం మండలంలోని గ్రామాల్లో 9.15 ఎకరాలు భూసేకరణ చేయాలని నిర్ణయించారు. నాలుగేళ్ల క్రితం భూ సేకరణ కోసం ఆదేశాలు ఇచ్చారు. అయితే కర్ణాటక ప్రాంతంలో భూసేకరణ పనులు పూర్తి చేసుకుని మారికుప్పం నుంచి చిత్తూరు సరిహద్దు వరకు పనులు వేగవంతం చేశారు.

## రేవంత్ రెడ్డి ఎలక్షన్స్ పర్యటన రీత్యా పిడిఎస్ యు

# జన్నారపు రాజేశ్వర్ ముందుస్తు అరెస్ట్



నిజామాబాద్(ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లాలో ముఖ్యమంత్రి ఎలక్షన్స్ ప్రచారం ,తే యూ పర్యటన రీత్యా పిడిఎస్ యు జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ ను ఉదయం 4 గంటలకు ఇంట్లో చొరబడి అరెస్ట్ చేశారు, జన్నారపు రాజేశ్వర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నియంతృత్వ పాలన కొనసాగిస్తుందని, విద్యార్థుల కోసం ప్రశ్నించే గొంతులను నిర్బంధించటం సరైంది కాదని , ఎలక్షన్ కోడ్ అమలు సమయంలో ఎటువంటి కార్యక్రమాలు చేపట్టకున్న అరెస్టు చేయటం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థి నేతల మీద ఉన్న దృష్టి ప్రజా సమస్యలు ,విద్యా రంగ సమస్యలపై దృషి పెట్టాలని అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో విద్యారులు యువత కాంగ్రెస్ పార్టీ కి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని

# యువకుడు దుర్మరణం



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) గుర్తుతెలియని వాహనం ఢీకొని ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలోని కోనాయిపల్లి గ్రామానికి చెందిన యువకుడు మృతి చెందాడు.ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి కోనాయిపల్లి గ్రామానికి చెందిన యువకుడు గుంటి నవీన్ అలియాస్ లడ్డు (35) తన బంధువులు శుక్రవారం చనిపోవడంతో అంత్యక్రియలకు వెళ్లాడు.అనంతరం తన బైక్ పై తిరిగి వస్తుండగా మార్గమధ్యలో కాళ్లకల్ మైకో కంపెనీ వద్ద గుర్తుతెలియని వాహనం వెనుక నుండి ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.కాగా మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# ఈవీఎం గోడౌన్ ను సందర్శించిన కలెక్టర్



నిజామాబాద్(ప్రశ్న న్యూస్) జిల్లా కేంద్రంలోని వినాయకనగర్ లో గల ఈవీఎం గోడౌన్ ను కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ శుక్రవారం సందర్శించారు. సాధారణ పరిశీలన ప్రక్రియలో భాగంగా క్షేత్రస్థాయి సందర్శన జరిపారు. ఈవీఎం గోడౌన్ కు వేసిన సీళ్లను పరిశీలించారు. ఈవీఎం గోడౌన్ వద్ద పోలీసు బందోబస్తు తీరును గమనించి పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజు, సిబ్బంది సాత్విక్, విజయేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## శ్రీ కాళహస్తి బ్రహ్మోత్సవాలు

# ఘనంగా నిర్వహిస్తాం



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) ఆగమ శాస్త్రాలు, హిందూ ధర్మ సనాతన ఆచారాలకు అనుగుణంగా శ్రీకాళహస్తి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తాం రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ప్రతి శివరాత్రిని కొత్త శివరాత్రిలా భావించి ముందస్తు ఏర్పాట్లు, ఉత్సవాల్లో అదనంగా వాలంటీర్లను ఏర్పాటు చేయాలి ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ జవహర్ లాల్ శ్రీకాళహస్తి బ్రహ్మోత్సవాలకు ఇతర రాష్ట్రాల్లో విశేష ప్రాచుర్యం భక్తులకు ఇబ్బందులు లేకుండా దర్శనం కల్పించడమే లక్ష్యం ఎండోమెంట్ కమిషనర్ రామచంద్ర మోహన్ గత ఏడాదికంటే మెరుగ్గా ఈ ఏడాది బ్రహ్మోత్సవాల నిర్వహణ బాల్య వివాహాల నివారణకు కఠిన చర్యలు జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్. కమాండ్ కంట్రోల్ బలోపేతం,సీసీ కెమెరాల ఏర్పాటు,సామాన్య భక్తులు,వీఐపీలకు కట్టుదిట్టమైన బందోబస్తు ఎస్.పి ఎల్.సుబ్బరాయుడు గతం కంటే మెరుగ్గా బ్రహ్మోత్సవాల నిర్వహణ, ప్రతి భక్తునికి స్వామి అమ్మవార్ల పసుపు కుంకుమ పాకెట్ క్యాలెండర్ పంపిణీ శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి. బ్రహ్మోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో రానున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు పగడ్బందీగా చేపడతాం ఆలయ ఈ వో బాపిరెడ్డి. ట్రస్ట్ బోర్డు సభ్యులందరూ సమిష్టిగా కృషి ఆలయ చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్.ఆగమ శాస్త్రాలు, హిందూ ధర్మ సనాతన ఆచారాలకు అనుగుణంగా శ్రీ కాళహస్తి బ్రహ్మోత్సవాలు ఘనంగంగా నిర్వహిస్తామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు.

# షాద్ నగర్‌లో బీఆర్ఎస్ ప్రచారం

## - పాల్గోన్న మాజీ ఎమ్మెల్యే అంజయ్య

**షాద్ నగర్** షాద్ నగర్ పట్టణం నాలుగో వార్డ్ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పాల్గొని, నాలుగో వార్డ్ టీఆర్ఎస్ అభ్యర్థి వాణి పాండురంగారెడ్డి గారికి మద్దతుగా ఇంటింటా తిరిగి ప్రచారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ప్రజలంతా కేసీఆర్ వైపే ఉన్నారని, రాష్ట్రంలో అభివృద్ధి అనేది కేసీఆర్ హయాంలోనే జరిగిందని స్థానికులు అభిప్రాయపడ్డారని తెలిపారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం తిట్టడం తప్ప అభివృద్ధిపై దృష్టి పెట్టడం లేదని విమర్శించారు.

గారడి మాటలతో కాలం వెల్లదీస్తోందని ఆరోపించారు.కేసీఆర్ అధికారంలో లేని కారణంగా అభివృద్ధి పనులు నిలిచిపోయాయని, మహిళలకు రావాల్సిన కిట్లు కూడా అందడం లేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీ లను నెల రోజుల్లో అమలు చేస్తామని చెప్పి, ఇప్పటివరకు అమలు చేయకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని పేర్కొన్నారు.నాలుగో వార్డులో టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి వాణి పాండు రంగారెడ్డి గారిని గెలిపిస్తేనే గతంలో జరిగిన అభివృద్ధికి ఫలితం ఉంటుందని, మళ్లీ షాద్ నగర్ పట్టణం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని ప్రజలు విశ్వాసం వ్యక్తం చేసినట్లు తెలిపారు.

# వైసీపీ హిందూ ద్రోహి

## - జగన్.. పాలు, వెన్న లేకుండా నెయ్యి తీశాడు

**విజయవాడ** తిరుమల శ్రీవారి సొమ్ముతో కల్తీ నెయ్యితో ప్రసాదాలు తయారుచేసి ప్రజలకు పంచిపెట్టారు.. ఇది మహా పాపమని ఎమ్మెల్సీ నాగబాబు అన్నారు. అసలు తిరుమల నెయ్యిలో నెయ్యి లేదు . వైసీపీ ప్రభుత్వంలో అప్పటి టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి కెమికల్స్ తో నెయ్యి చేసి భక్తులకు పంచి పెట్టాడు . అసలు వైకాపానే హిందూ ద్రోహి అని మండిపడ్డారు.

## వికారాబాద్‌లో స్పీకర్

# గడ్డం ప్రసాద్ కుమార్ ప్రచారం

**వికారాబాద్** వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని 24 వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి దొడ్ల జయప్రద ప్రతాపరెడ్డి ప్రచారంలో పాల్గొన్న గడ్డం స్పీకర్ ప్రసాద్ కుమార్ వికారాబాద్ మున్సిపల్ మున్సిపల్ పరిధిలో కాంగ్రెస్ జెండా ఎగర వేస్తాం అని ప్రజలే హామీ ఇస్తున్నారు. ఎందుకంటే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసే ప్రజా పాలనను రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారు. ప్రజలకు కావలిసిన అన్ని సదుపాయాలు ముఖ్యంగా ఇండ్లు గానీ, కరెంటు, ఫ్రీ బస్సు మరియు వికారాబాద్ కు వందల కోట్ల నిధులు తీసుకొచ్చన ఏకైక నాయకుడు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కాబట్టి వికారాబాద్ పట్టణ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గెలిపించుకొని మరింత అభివృద్ధి దిశగా వెళ్దాము తెలిపారు. వికారాబాద్లో బి ఆర్ ఎస్, బీజేపీ రెండు కూడా మా కాంగ్రెస్ పార్టికి ప్రేమ పోటీ చేశలేని స్థితిలో ఉన్నాయని వారు తెలిపారు.

## విద్యార్థులకు ఉచితంగా

# స్టడీ మెటీరియల్ పంపిణీ



**పిడుగురాళ్ల :** పిడుగురాళ్ల పట్టణంలోని 17వ వార్డు శ్రీ బాబు జగజీవన్ రావ్ ప్రాథమిక ఉన్నత పాఠశాల (మిలిటరీ స్కూల్) నందు ఎంఈఓ 1 ఏ. శ్రీనివాస రెడ్డి, ఎంఈఓ 2 వై. శ్రీనివాసరావు, ఆధ్వర్యంలో స్కూల్ హెడ్ మాస్టర్ ఖీ.కోటేశ్వరావు సొంత నిధులతో 1నుండి 5వ తరగతి చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ( మ్యాక్స్ ఒలంపియాడ్) పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పిడుగురాళ్ల పట్టణ అధ్యక్షులు పిల్లి చెన్నారావు, సొసైటీ చైర్మన్ వడ్డవల్లి సర్వేస్వరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ వున్నం ఆంజనేయులు, 17వ వార్డు ఇంచార్జి వర్ల రత్నం, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ చల్లగుండ్ల రూబెన్, పిడుగురాళ్ల పట్టణ టీడీపీ సెక్రటరీ మేకల ఆంజనేయులు యాదవ్, మంద అరుణ్, 22వ వార్డు మాజీ కౌన్సిలర్ పణితి కాంతారావు, 5వ వార్డు ఇంచార్జి కందిమళ్ళ శ్రీనివాసరావు,6వ వార్డు ఇంచార్జి బిజ్జిలి వెంకట్రావు, 16వ వార్డు ఇంచార్జి జమ్మిశెట్టి రామకృష్ణ (జెమిని), గడిపూడి సాంబశివరావు, బూత్ కన్వీనర్ బొక్క శ్రీను, ఐతం దేవదానం, గవర్నమెంట్ స్కూల్ ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 23వ వార్డ్ సమస్యలు పరిష్కరిస్తా

## ఆశీర్వదించండి దీవించండి

- కమలం గుర్తుకు ఓటు వేసి గెలిపించండి.
- తెలుగుఆంజనేయులు



**వనపర్తి** 23వ వార్డులోని భారతీయ జనతా పార్టీ బలపరిచిన అభ్యర్థి ఉందే కోటి.తెలుగు ఆంజనేయులు 23 వ వార్డు అభివృద్ధి చేయడానికి ముందంజలో నేనుంటా ప్రజలు గెలిపించి ఆశీస్సులు ఇవ్వాలని కోరుతూ ఈరోజు స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థి దయానంద ముదిరాజు మద్దతు తెలియజేయడం జరిగింది.వనపర్తి పట్టణం వనపర్తి జిల్లాలో బిజెపి అభ్యర్థి తెలుగు ఆంజనేయులు ఇంటింటికి ప్రచారం చేస్తూ అభివృద్ధి చేస్తాను సమస్యలు పరిష్కరిస్తాను కమలం గుర్తుకు ఓటెయ్యండి ప్రజలను కలుస్తూ వారి సమస్యలు తెలుసుకుంటూ ఓటేయండి అని ప్రచారం చేస్తూ అందరి అభ్యర్థులు కన్నా ముందడుగులో ఉన్నాడు 23వ వార్డు అభివృద్ధి నా లక్ష్యం కమలం గుర్తుకు ఓటు వేసి గెలిపించండి.ఈ కార్యక్రమంలో వాకిటి సుదర్శన్ వార్డు ఇంచార్జ్,బిజెపి సీనియర్ నాయకులు మల్లెల శ్రీనివాసులు ,సీనియర్ నాయకులు సంద వెంకటేష్, ఉందే కోటి వెంకటేష్, ఈశ్వర్ గౌడ్, నాగరాజు ,చంద్రశేఖర్, నాగన్న, మహిళలు చంద్రమ్మ, కృష్ణవేణి, నాగమణి, కౌసల్య, కవిత, సుమిత్రమ్మ మాజీ కౌన్సిలర్, నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను

# జయప్రదం చేయండి

## - ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాసా రాంబాబు పిలుపు




**నరసరావుపేట,** నరసరావు పట్టణంలో శుక్రవారం ఏఐటియుసి ఆధ్వర్యంలో బేవరేజ్ కార్పొరేషన్ కార్మికులతో కలిసి ఫిబ్రవరి 12వ తేదీన జరిగే సమ్మెలో పాల్గొనాలని ప్రచారం నిర్వహించడం జరిగింది. అంతేకాకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా కార్మిక రైతాంగ వ్యతిరేక విధానాలపైన కలిసికట్టుగా పనిచేయాలని జాతీయ బ్యాంకులను కాపాడుకుందాం అని అవుట్సోర్సింగ్ కాంట్రాక్ట్ కార్మికుల కార్మికులను పర్మినెంట్ చేయాలని ఉద్యోగ భద్రత కల్పించాలని సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని పని గంటల దినాన్ని తగ్గించాలని, లేబర్ కోర్స్ ని రద్దు చేయాలని, కార్మిక చట్టాలను పునరుద్దించాలని, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాసా రాంబాబు, ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పలపాటి రంగయ్య, సిపిఐ మండల కార్యదర్శి రోడ్డ అంజిరెడ్డి, పట్టణ కార్యదర్శి ఎస్కె చిన్న జాను సైదా, కోయ శీను, అన్ని బ్యాంకు నాయకులకు కలిసి ప్రచార నిర్వహించి కరపత్రాలని అందజేయడం జరిగింది. ఫిబ్రవరి 12వ తేదీన ఆర్టీసీ బస్టాండ్ దగ్గర నుండి గాంధీ పార్క్ వరకు జరిగే ర్యాలీలు కార్మికులు ఉద్యోగులు, రైతులు అందరు పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో నర్సిరెడ్డి శ్రీనివాసరెడ్డి నాగిరెడ్డి విశ్వేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ బస్సులో చెలరేగిన మంటలు

- అప్రమత్తమైన ఆర్టీసీ సిబ్బంది - బస్సులో ప్రయాణిస్తున్న 29 మంది ప్రయాణికులు
- ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో ఊపిరి పిలుచుకున్న ప్రయాణికులు

తిరుపతి నుంచి వినుకొండ వెళుతున్న ఆర్టీసీ బస్సులో మంటలు చెలరేగి అగ్ని ప్రమాదం చోటు చేసుకున్న ఘటన నాయుడుపేట సమీపంలోని విన్నమాల వద్ద చోటుచేసుకుంది. షార్ట్ సర్క్యూట్ వల్ల ఆర్టీసీ బస్సులు మంటలు చెలరేగడంతో ప్రయాణికులు భయభ్రాంతులకు గురయ్యారు. డ్రైవర్ అప్రమత్తమై బస్ ను ఆపివేయడంతో ప్రయాణికులు బస్ దిగి ప్రాణాలు కాపాడుకున్నారు. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకొని మంటలు అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనలో బస్ లోపలి భాగం పాక్షికంగా కాలిపోయింది. ఈ ప్రమాదంలో ప్రయాణికులు సురక్షితంగా బయటపడడంతో ఊపిరి పీల్చుకొన్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు

# రైల్వే ఉద్యోగి అనుమానస్పద మృతి




**నెల్లూరు** కావలి నియోజకవర్గం లోని రుద్రకోటలో నాగరాజు అనే రైల్వే ఉద్యోగి అనుమానాస్పదంగా మృతి చెందాడు. నాగరాజు తన ఇంటి వరండాలో చనిపోయిన విషయాన్ని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకొన్న పోలీసులు నాగరాజు వంటి పై కత్తిపోట్లు ఉండడంతో గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసినట్లు భావిస్తున్నారు. నాగరాజు భార్య ముగ్గురు పిల్లలు. భార్య బిడ్డలు వూరు వెళ్ళిన సమయంలో నాగరాజు హత్యకు గురవడం పాలు అనుమానాలకు తావిస్తుంది. నాగరాజు అనుమానాస్పద మృతి పై కావలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నాగరాజు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు

# జన సైనికులలో విబేధాలు

## - ఘర్షణలకు దిగుతున్న గ్రూపులు

**రాజోలు** రాజోలు జనసేన పార్టీకి కంచుకోట అంటారు... అటువంటి పార్టీ కోటకు బీటలు వారుతున్నాయా..? అంటే అవుననే అంటున్నారు పలువురు రాజకీయ విశ్లేషకులు. జనసేన పార్టీలోని కొందరు కీలక నేతలు దుందుడుకు చర్యలకు, నిరంకుశ వైఖరి వల్ల పార్టీకి చెడ్డపేరు వస్తోందని కొందరు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. అయినా దిద్దుబాటు చర్యలు లేకపోవడంతో పార్టీకి మరింత చెడ్డపేరు వస్తుందని కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు. రెండు రోజుల క్రితం మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురం లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్దే జనసేన సీనియర్ కార్యకర్త, కోనసీమ కొబ్బరి సమస్యలను పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లిన ముత్యాల ఖన్నా పై పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి బాలాజీ వర్గం నిష్కారణంగా జరిపిన దాడి నియోజకవర్గంలో చర్చాంశనీయంగా మారింది.మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద కూటమి ముఖ్య నేతలు అత్యవసర సమావేశ సమయంలో ముత్యాల ఖన్నా అనే కార్యకర్త వేరే పనిపై ఎమ్మెల్యే కోసం వెళ్లడం జరిగిందని,ఆ సమయంలో ఎమ్మెల్యే అందుబాటులో లేకపోవడంతో,అక్కడ ఏదో ప్రెస్ మీట్ జరుగుతుండటంతో.ఆ సమయంలో అక్కడున్న ఖన్నాని.. అక్కడ నుంచి వెళ్లిపొమ్మని బాలాజీ వర్గం బెదిరించినా,ఇతను వెళ్లకపోవడంతో పాత మనస్పర్థలు దృష్టిలో పెట్టుకొనే ఖన్నా పై బాలాజీ వర్గం దాడి చేయగా అపస్మారక స్థితిలో ఉన్న అతనిని రాజోలు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు.ఈ విషయమై ఈరోజు పార్టీ పెద్ద దిక్కుగా ఉన్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ సమక్షంలో చర్చించగా వందలాదిగా జనసైనికులు బాధితుడికి అండగా నిలిచారు. దాడికి పాల్పడిన దిరిశాల బాలాజీ వర్గం పై కేశనపల్లి గ్రామస్తులు ఆగ్రహావేశాలు తో ఊగిపోయారు. తక్షణమే బాలాజీ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.దీనిపై స్పందించిన ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ మాట్లాడుతూ...ఎంతో క్రమశిక్షణ కలిగిన పార్టీ జనసేన పార్టీ అని, అంటువంటి పార్టీలో తప్పు చేస్తే తప్పకుండా క్రమశిక్షణ చర్యలు ఉంటాయని, వెంటనే పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి సత్వరమే చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

## టీటీడీ నూతన ఈఓగా రవిచంద్ర బాధ్యతలు స్వీకరణ



**తిరుమల** టీటీడీ నూతన ఈఓగా ముద్దాడ రవిచంద్ర బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం ఉదయమే రవిచంద్ర వరాహస్వామివారిని దర్శనం చేసుకుని.. అనంతరం వైకుంఠం క్యూ కాంప్లెక్స్ ద్వారా శ్రీవారి సన్నిధికి చేరుకున్నారు. తరువాత స్వామి సన్నిధిలో ప్రమాణ స్వీకారం చేసి ఈవోగా బాధ్యతలు స్వీకరించారు. శ్రీవారి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కట్టుబడి ఉంటానని ఈవో తెలిపారు. కాగా టీటీడీ ఈవోగా రవిచంద్ర బాధ్యతలు చేపట్టట్టం రెండోసారి. అంతకుముందు అయన ముఖ్యమంత్రి కార్యాలయం ప్రత్యేక ముఖ్య కార్యదర్శిగా ఉన్నారు. గతంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా కలెక్టర్ గా ఇంకా అనేక పదవుల్లో పనిచేశారు

## మున్సిపల్ ఎన్నికల్లో జాగృతి పార్టీ నుంచి సీనియర్ జర్నలిస్ట్ ఎం.డి. సద్దాం పోటీకి సిద్ధం



అంబర్ పేట(ప్రశ్న న్యూస్) రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో జాగృతి పార్టీ తరఫున సీనియర్ జర్నలిస్ట్ ఎం.డి. సద్దాం ఎన్నికల బరిలోకి దిగేందుకు సిద్ధమయ్యారు. ప్రజాసేవ లక్ష్యంగా రాజకీయాల్లోకి అడుగుపెడుతున్నట్లు ఆయన ప్రకటించారు. మీడియా రంగంలో దీర్ఘ అనుభవం ఉన్న సద్దాం, ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం పార్టీ అధ్యక్షురలు కవిత అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలంగాణ ప్రజలు కూడా ఆమె పాలనను కోరుకుంటున్నారు. దానితో స్థానిక అభివృద్ధి, పారదర్శక పాలన, ప్రజల సమస్యల పరిష్కారం తన ప్రాధాన్యంగా ఉంటాయని సద్దాం చెప్పారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఆయన అభ్యర్థిత్వం స్థానిక రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది.

## ఉప్పల్ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులను సన్మానించిన హరిహర క్షేత్రం శ్రీ చిలుకశ్వేర అంజనేయు స్వామి దేవాలయం కమిటీ



ఉప్పల్ (ప్రశ్న న్యూస్) ఉప్పల్ ప్రెస్ క్లబ్ నూతన కమిటీ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన రమా కిషోర్ ని, కమిటీ సభ్యులను ఆలయకమిటీ అధ్యక్షులు దాసరి కృష్ణ ప్రధాన కార్యదర్శి గోనె శ్రీకాంత్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉప్పల్ సర్కిల్ అభివృద్ధిలో పాత్రికేయుల పాత్ర ఎంతైనా ఉందని సమాజంలో జరిగే అని విషయాలను ప్రజలకు తెలియజేస్తూ అభివృద్ధి, సమస్యలను ఎత్తి చూపుతూ ఎప్పటికప్పుడు అవగాహన కల్పించే భాధ్యతను వారు నిర్వహిస్తారని అన్నారు. చిల్కానగర్ శివాలయం పున్నరునిర్మాణంలో కూడా పాత్రికేయు సోదరుల సహాయ సహకారాలు ఉండాలని ఆలయకమిటీ సభ్యులు కోరారు.ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఉప్పల్ ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యులు, ఆలయకమిటీ సభ్యులు జెల్లీ మోహన్, గోనె అంజయ్య, గోపాల్ రెడ్డి, కావాలి నర్సింహ్మా, మాస శేఖర్, పైడిపాల గౌరయ్య, దండు అంజయ్య, పోలోజు శ్రీనివాస్ చారి, రుద్రరపు శంకర్, మాదుగుల శ్రీనివాస్ యాదవ్, కాసుల రామకృష్ణ, మల్లేష్ ముదిరాజ్, నాని ముదిరాజ్, పాల్గొన్నారు.

## సంక్షేమం కోసం వార్డు సభ్యుల కమిటీలు త్వరలో ఏర్పాటు

**- రాష్ట్రవ్యాప్తంగా పర్యటనలు చేపడతాం**

**- తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు : అతికం రాజశేఖర్ గౌడ్**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో త్వరలో వార్డు సభ్యుల కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు తెలంగాణ వార్డు సభ్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు, న్యాయవాది అతికం రాజశేఖర్ గౌడ్ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ,తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా వార్డు సభ్యుల సంక్షేమం కోసం నిరంతరం పోరాడే వారికి సంఘం ద్వారా మరిన్ని అవకాశాలు కల్పిస్తామని అన్నారు. వార్డు సభ్యుల హక్కులు, సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ కట్టుబడి పనిచేయాలని పిలుపునిచ్చారు.రానున్న రోజుల్లో వార్డు సభ్యుల సమస్యలు తెలుసుకోవడానికి రాష్ట్రవ్యాప్తంగా పర్యటనలు నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి బత్తిని అనిల్ గౌడ్‌తో పాటు పలువురు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## వార్డు సభ్యుల సమస్యల పరిష్కార దిశగా పని చేస్తా

**- రాష్ట్ర కార్యవర్గ సభ్యులు :-సాంబయ్య గౌడ్**

**- వార్డు సభ్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నాగుల సాంబయ్య గౌడ్ నియామకం**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని వరదవెల్లి గ్రామ పంచాయతీ వార్డు సభ్యుడు నాగుల సాంబయ్య గౌడ్‌ను తెలంగాణ రాష్ట్ర వార్డు సభ్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమించారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షులు, న్యాయవాది అతికం రాజశేఖర్ గౌడ్ శుక్రవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నాగుల సాంబయ్య గౌడ్ మాట్లాడుతూ వార్డు సభ్యుల సంక్షేమమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వార్డు సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షులు అతికం రాజశేఖర్ గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెస్రం నర్సయ్యలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని, త్వరలోనే రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో నూతన కమిటీలను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

## ఫారెస్ట్ కాలేజీలో విద్యార్థులకు ఔషధ మొక్కలపై అవగాహన సదస్సు

హైదరాబాద్(ప్రశ్న న్యూస్) ములుగులోని ఫారెస్ట్ కాలేజ్ అండ్ రీసెర్చ్ ఇన్ స్టిట్యూట్ లో చదువుతున్న ఫైనల్ ఇయర్ విద్యార్థులకు ఔషధ మొక్కల ప్రాధాన్యత, వాటి గుర్తింపు సాంప్రదాయ వైద్య విధానాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. ఆయుర్వేద పరంపర మూలిక వైద్య మహా సంఘం (రి.నెం: 979/2025) ఆల్ హెర్బల్ ట్రెడిషనల్ ప్రాక్టీషనర్ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో





కాలేజీలో ప్రసంగిస్తున్న లక్ష్మణ్ స్వామి



ధ్రువీకరణ పత్రాలు స్వీకరించిన విద్యార్థులు

ఆయుర్వేద పరంపర మూలిక వైద్య మహా సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు సింహాచలం లక్ష్మణస్వామి, ఆల్ హెర్బల్ ట్రెడిషనల్ ప్రాక్టీషనర్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎండి. రఫీయుద్దీన్ విద్యార్థులకు అటవీ సంపదలోని అరుదైన మూలికలను పరిచయం చేశారు. నిత్య జీవితంలో ఔషధ మొక్కల వినియోగం, పారంపర్య వైద్య జ్ఞానాన్ని ఆధునిక అటవీ విద్యతో అనుసంధానం చేయడం, ప్రకృతి పరిరక్షణలో మూలికల పాత్ర వంటి అంశాలపై విద్యార్థులకు స్పష్టమైన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమ నిర్వహణకు సహకరించిన ఎఫ్.సి.ఆర్.ఐ ఉన్నతాధికారులకు, ముఖ్యంగా జాయింట్ డైరెక్టర్ శ్రీధర్ రావు, డిప్యూటీ డైరెక్టర్ కవిత, బి.ఎస్.ఎస్ విభాగపు ప్రొఫెసర్ మమత కి ఆయుర్వేద పరంపర మూలిక వైద్య మహా సంఘం తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. కాలేజీ యాజమాన్యం చూపిన చొరవ వల్ల విద్యార్థులకు క్షేత్రస్థాయిలో అద్భుతమైన జ్ఞానం లభించిందని లక్ష్మణస్వామి పేర్కొన్నారు. వర్క్‌షాప్‌లో చురుగ్గా పాల్గొన్న విద్యార్థులందరికీ సంస్థ తరపున 'పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు' అందజేశారు. భవిష్యత్తులో ప్రతి విద్యాసంస్థలోనూ ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, అంతరించిపోతున్న వనమూలికల వైభవాన్ని చాటిచెప్పడానికి తమ సంఘం సిద్ధంగా ఉందని నిర్వాహకులు ప్రకటించారు. ఔషధ మొక్కల గురించి మరిన్ని వివరాలకు లేదా తమ కాలేజీల్లో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించాలనుకునే వారు 9908289830 నంబరును సంప్రదించవచ్చు.

## ప్రభుత్వ భూముల పరిరక్షణలో రెవెన్యూ అధికారుల చొరవ

**- దశాబ్ద కాలంగా ప్రభుత్వ భూమి కబ్జా**

**- ఎకరం నర భూమిపై కబ్జా గుర్తింపు**

**- హద్దు ఖనీలు పాతించిన రెవెన్యూ అధికారులు - రైతుల హర్షం**





బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని తడగొండ గ్రామంలో ప్రభుత్వ భూమి కబ్జా వ్యవహారం రెవెన్యూ అధికారుల పరిశీలనతో బయటపడింది. సర్వే నంబరు 435లో గల ప్రభుత్వ భూమిని గత 10 ఏళ్లుగా అక్రమంగా ఆక్రమించి సాగు చేస్తున్నారని గ్రామ రైతులు ఫిర్యాదు చేశారు. అదే గ్రామానికి చెందిన చేపూరి మహేష్ అనే రైతు ప్రభుత్వ భూమిని తన ఆధీనంలోకి తీసుకొని బావి తవ్వించి సాగు చేస్తున్నాడని రైతులు ఆరోపించారు. దీనిపై స్పందించిన రెవెన్యూ శాఖ అధికారులు శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ మనోజ్, సర్వేయర్, జీపీఓ కవిత కలిసి భూమిని క్షేత్రస్థాయిలో పరిశీలించి, సుమారు ఎకరం నర వరకు భూమి (బావితో సహా) కబ్జాలో ఉన్నట్లు గుర్తించారు. అనంతరం అధికారికంగా హద్దు ఖనీలు పాతించారు.ప్రభుత్వ భూమిని గుర్తించి చర్యలు తీసుకోవడంతో గ్రామ రైతులు హర్షం వ్యక్తం చేస్తూ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

## పైరవీకారుల మాటలు నమ్మొద్దు ఈటల:సంకీ రవిందర్

**లంగ్స్ స్పేస్ అంటూ విలీనాన్ని వీడిన ఎంపీ ఈటల రాజేందర్:సంకీ**

**సికింద్రాబాద్ కంటోన్మెంట్ అభివృద్ధి లేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న పట్టించుకోని వైనం ఎంపీ ది**

**చావు బతుకుల మధ్యలో ఉన్న కంటోన్మెంట్ కి కేంద్రం ఇప్పటి వరకు మూడు సార్లు "గ్రాంట్"విడుదల చేయడమే "మేర్జ్"కి ఓ నిదర్శనం**

**మౌళిక కల్పనల్లో బోర్డు ఫ్యెల్యుర్,జిహెచ్ఎంసి కన్న అధికంగా పన్నులు వసూలు**

**ఆ నలుగురు మాటలు కట్టిపెట్టి,ఈటల నోట "మేర్జ్"మాట రావాల్సిందే:సంకీ రవింధర్**

**కేంద్రం నిరంకుశ పాలనను ప్రజలు వ్యతిరేకిస్తూ, పోరాటానికి జై కొడుతారు**



కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ఉన్న ఎనిమిది వార్డులను జిహెచ్ఎంసిలో విలీనం చేయాలని మంచు వికాస్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత సంకీ రవింధర్ డిమాండ్ చేశారు.మారెడ్ పల్లిలో విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎట్టి పరిస్థితుల్లోనూ జిహెచ్ఎంసి లో మేర్జ్ చేసే వరకు ప్రజాస్వామ్యంలో పోరాటం ఆగదని సంకీ రవింధర్ పేర్కొన్నారు. అలాగే మల్కాజిగిరి ఎంపీ నియోజకవర్గం నుంచి పోటి చేసిన భాజపా నేత ఈటల రాజేందర్.ఏడు నియోజకవర్గాల ప్రజలు అత్యధికంగా ఓట్లు వేసి గెలిపించిన విషయాన్ని మర్చిపోవద్దన్నారు. అదిగాక మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న ఏడు నియోజకవర్గాల్లో ఆరు నియోజకవర్గాలని రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలో ఉండగా,మిగిలినది సికింద్రాబాద్ కంటోన్మెంట్ లో కనీసం ఎన్నికల పై కూడా పెదవి విప్పలేదు,కానీ రక్షణ మంత్రిత్వ శాఖ అధికారులకు మాత్రం ఆరేళ్లుగా సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డులో ఎన్నికలు లేవని "లేఖ"అందజేసి చేతులు దులుపుకున్నారు. ఇదెక్కడి సాంప్రదాయం అంటూ నిలదీస్తున్నారు సంకీ రవింధర్. విలేకరుల సమావేశంలో పదే పదే ఎంపీ ఈటల పై విమర్శల వర్షం కురిపించారు.ఇప్పటికైె స్థానిక ప్రజలు కొరుక్కుంటున్న విలీనాన్ని వ్యతిరేకించకుండా,



నియోజకవర్గం .అసలు ఎంపీ ఈటల పార్లమెంట్ హౌస్ లో అవకాశం దొరికితే కేవలం కంటోన్మెంట్ ప్రాంతంలో ఎదురైతున్న సమస్యలు పట్ల మాట్లాడాలి, లేక రైల్వే అంశాలపై మాట్లాడాలి. సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డులో కాలం చెల్లిన చట్టాలతో అధికారులు పరిపాలన అందిస్తూ, ప్రజలు నానారకాలుగా నరకయాతనకు గురౌతున్నారు. ఎనిమిది వార్డుల్లో అంతర్గత రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, మంచినీటి సరఫరా పలు ప్రాంతాల్లో అనేక రకాల సమస్యలుతో ప్రజల బాధలు వర్ణనాతీతం.కానీ ఇన్ని ఇబ్బందులు తలెత్తుంటే ఎంపీ ఈటల రాజేందర్ మాత్రం పైరవీ కారుల మాటలకు మంత్రముగ్ధులు అవుతూ, పార్లమెంట్ హౌస్ గౌరవించి, మేర్జ్ వైపే మొగ్గు చూపాలని డిమాండ్ చేశారు. అలాగే గడిచిన రెండేళ్లలో ఎంపీ ఈటల రాజేందర్ సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డుకి ఏ మాత్రం కేంద్రం నుంచి నిధులు తెచ్చారని ఆయన నిలదీశారు .అసలు పెండింగ్లో ఉన్న సర్వీస్ చార్జీలు సుమారు 12 వందల కోట్ల రూపాయల్లో ఒక్క రూపాయి అయినా తీసుకువచ్చారా అన్నారు. కానీ చావు బతుకుల్లో ఉన్న కంటోన్మెంట్ బోర్డుకి మాత్రం కేంద్రం రక్షణ మంత్రిత్వ శాఖ నుంచి ఐదు మాసాల్లో రెండు సార్లు "గ్రాంట్"విడుదల కావడం అందర్నీ ఆశ్చర్యానికి గురి చేసింది. ఇదే భాజపా పరిపాలన తీరు. రాష్ట్ర ప్రభుత్వం తల పెట్టిన "ఎలివేటెడ్ కారిడార్ల' 'ప్రాజెక్టు అందరికి తెలిసిందే!ఈ నేపథ్యంలో సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు, ఆర్మీకి చెందిన భూమి రాజీవ్ రహదారి, నాగ్ పూర్ రహదారి పై వారికి చెందిన భూమి నష్టం పోవడం వల్ల "324"కోట్ల రూపాయలు రక్షణ శాఖలో జమ అయిన విషయం అందరికి తెలిసిందే!ఆ నిధులు స్థానిక ఎమ్మెల్యే శ్రీ గణేష్, గత సిఇవో మధుకర్ నాయక్ అహర్నిశలు శ్రమించడం వల్ల ఆ నిధులు సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు ఖాతాలో జమ అయ్యాయి.దీని వల్లనే ప్రస్తుతం కంటోన్మెంట్ బోర్డు పరిధిలో అభివృద్ధి చేస్తామని బిజెపి నేతలు చెప్పుకోవడం నిజంగా శోచనీయమని సంకీ రవింధర్ ఆవేదన వ్యక్తంచేశారు.అసలు విషయం ఏమిటంటే ఆ 324 కోట్లు రాకపోతే బోర్డు పరిస్థితి మరీ దారుణంగా ఉంటుందని తెలిపారు.

### బద్రీనాథ్ మాటల తూటాలు:

మోండా డివిజన్ పరిధిలో భాజపా కార్పొరేటర్ కొంతం దీపిక ప్రజలకు ఏం చేసిందో అందరికి తెలిసిందే, కొత్తగా మేము చెప్పాల్సిన అవసరం లేదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బద్రీనాథ్ యాదవ్ వెల్లడించారు.అలాగే మారెడ్ పల్లి ప్రాంతాల్లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఆశల పై నీళ్లు చల్లిన ఘనత ఆమెకే దక్కిందన్నారు.ముడ్రోజుల క్రితం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ తో కలిసి స్థానిక కార్పొరేటర్ కొంతం దీపిక రెండు పడకల గదుల వద్ద ధర్నలో పాల్గొని కాంగ్రెస్ పార్టీ పై విమర్శలు చేయడం సరికాదని అన్నారు.

వారికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉంటే "149"మంది లబ్ధిదారుల జీవితాలతో ఆడుకునే వారు కాదన్నారు.అభం శుభం తెలియని అమాయకులతో రాజకీయ లబ్ధి కోసం ధర్న పేరుతో తెర లేపారు.అసలు బిజెపి నాయకులు ప్రజలకు సేవ చేసే ఆలోచన ఏ మాత్రం ఉన్న ఎమ్మెల్యే శ్రీ గణేష్ ఇచ్చిన లబ్ధిదారుల జాబితా లో ఎటువంటి ఇబ్బందులు ఉంటే తెలియజేయండ న్నారు,కానీ వీళ్లు చేసింది శాపనార్థాలు పెడుతూ సామాన్యుల కలను దూరం చేశారు.ప్రజలు అన్ని గమనిస్తున్నారు.త్వరలో బుద్ధి చెబుతారని బద్రీనాద్ యాదవ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శాంసన్ రాజు,మురళీ,నాగినేని సరిత, రాజేందర్,డి.సంజయ్, బల్వంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఒకవైపు పెళ్లి వార్తలు

## మరోవైపు బన్నీ సినిమా షూటింగ్‌లో రష్మిక!

నటి రష్మిక మందన్న తన వ్యక్తిగత, వృత్తిగత జీవితానికి సంబంధించిన వార్తలతో మరోసారి మీడియాలో హాట్ టాపిక్‌గా మారారు. ఒకవైపు నటుడు విజయ్ దేవరకొండతో ఆమె వివాహం జరగనుందనే ప్రచారం జోరుగా సాగుతుండగా, మరోవైపు ఆమె ఓ భారీ ప్రాజెక్ట్ షూటింగ్‌లో అడుగుపెట్టారు. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, ప్రముఖ దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న సైన్స్ ఫిక్షన్ యాక్షన్ చిత్రంలో రష్మిక జాయిన్ అయ్యారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ ముంబైలో జరుగుతోంది. ఈ వారంలోనే రష్మిక సెట్స్‌లోకి అడుగుపెట్టి తన పాత్రకు సంబంధించిన చిత్రీకరణలో పాల్గొంటున్నారు. ఫిబ్రవరి మధ్య వరకు ఈ షెడ్యూల్‌లో ఆమె పాల్గొంటారని సమాచారం. ఈ చిత్రంలో రష్మిక తన కెరీర్‌లోనే తొలిసారిగా నెగటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో కనిపించనున్నారని కొన్ని జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. సన్ పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో అల్లు అర్జున్‌కు జోడీగా దీపికా పదుకొణె నటిస్తున్నారు. ఇక వృత్తిపరంగా బిజీగా ఉంటూనే, రష్మిక పెళ్లి వార్తలు కూడా బలంగా వినిపిస్తున్నాయి. ఫిబ్రవరి 2న వీరి వివాహం అంటూ వచ్చిన వార్తలను రష్మిక ప్రతినిధులు ఖండించినా, ఇప్పుడు కొత్తగా ఫిబ్రవరి 26న ఉదయ్‌పూర్‌లో వీరి వివాహం జరగనుందనే ఊహాగానాలు మొదలయ్యాయి. ఇటీవల ఎయిర్‌పోర్ట్‌లో దీనిపై మీడియా ప్రశ్నించగా, "దేనికి రా?" అంటూ చిరునవ్వుతో బదులిచ్చి రష్మిక దాటవేయడం ఈ వార్తలకు మరింత బలాన్నిచ్చింది. ఫిబ్రవరి మధ్యలో షూటింగ్ నుంచి ఆమె విరామం తీసుకోనుండటం కూడా ఈ పెళ్లి కోసమేనని ప్రచారం జరుగుతోంది. అయితే, ఈ విషయంపై రష్మిక గానీ, విజయ్ దేవరకొండ గానీ అధికారికంగా స్పందించలేదు. ఈ విషయంపై నేరుగా స్పందించలేదు. పెళ్లి తేదీ దగ్గరపడుతున్న నేపథ్యంలో త్వరలోనే ఏదో ఒక అధికారిక క్లారిటీ వచ్చే అవకాశం ఉందని ఫ్యాన్స్ ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# మద్రాస్ హైకోర్టులో హీరో విజయ్‌కు నిరాశ

### - రూ.1.5 కోట్ల జరిమానాపై స్టే రద్దు



కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ దళపతికి మద్రాస్ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఆదాయపు పన్ను ఎగవేతకు సంబంధించి విధించిన రూ.1.50 కోట్ల జరిమానాను రద్దు చేయాలన్న పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. జరిమానా విధించిన ఆదాయపు పన్ను శాఖ ఉత్తర్వుల్లో ఎలాంటి చట్టవిరుద్ధం లేదని న్యాయమూర్తి జస్టిస్ సెంథిల్ కుమార్ రామమూర్తి స్పష్టం చేశారు. 2015--16 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి విజయ్ తన ఆదాయపు పన్ను రిటర్న్‌లో సుమారు రూ.35.42 కోట్ల ఆదాయం ప్రకటించారు. అయితే 'పులి' సినిమా ద్వారా వచ్చిన రూ.15 కోట్ల ఆదాయాన్ని ఖాతాల్లో చూపలేదని ఆదాయపు పన్ను శాఖ గుర్తించింది. 2015లో ఆయన నివాసంలో జరిగిన సోదాల్లో లభించిన పత్రాలను ఆధారంగా తీసుకుని ఈ విషయం బయటపడింది. దీనిపై 2022లో ఐటీ శాఖ రూ.1.50 కోట్ల జరిమానా విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ విజయ్ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించగా, తొలుత కోర్టు మధ్యంతర స్టే మంజూరు చేసింది. అనంతరం ఇరుపక్షాల వాదనలు విన్న కోర్టు గత నెలలో తీర్పును రిజర్వ్ చేసి, తాజాగా పిటిషన్‌ను తిరస్కరించింది. విజయ్ తరఫు న్యాయవాది వాదన ప్రకారం, చట్టపరంగా జూన్ 30, 2019లోపే జరిమానా ఉత్తర్వులు రావాల్సి ఉండగా 2022లో ఆలస్యంగా జారీ చేయడం చెల్లదని తెలిపారు. అయితే ఆదాయపు పన్ను శాఖ తరఫు న్యాయవాది, చట్ట నిబంధనల ప్రకారమే జరిమానా విధించామని వాదించారు. ఈ వాదనలను పరిశీలించిన కోర్టు, ఐటీ శాఖ నిర్ణయంలో తప్పేమీ లేదని తేల్చింది. తీర్పు అనంతరం విజయ్ తరఫు న్యాయవాది అప్పీల్ చేసుకునే అవకాశం ఇవ్వాలని కోర్టును కోరగా, అప్పీలేట్ అథారిటీని ఆశ్రయించే హక్కు విజయ్‌కు ఉందని న్యాయమూర్తి పేర్కొన్నారు. దీంతో హైకోర్టు స్థాయిలో కేసు ముగిసినప్పటికీ, తదుపరి న్యాయపరమైన మార్గాలు విజయ్‌కు అందుబాటులోనే ఉన్నాయి.



### ఓటీటీలోనూ


# శర్వానంద్ జోరు..

### - 'నారీ నారీ నడుమ మురారి'

## ప్రైమ్ వీడియోలో నంబర్ వన్!

చార్మింగ్ స్టార్ శర్వానంద్ నటించిన తాజా రోమ్–కామ్ ఎంటర్‌టైనర్ 'నారీ నారీ నడుమ మురారి' థియేటర్లలో మంచి విజయాన్ని నమోదు చేసిన విషయం తెలిసిందే. విడుదలైన తొలి వారంనుంచే ఈ సినిమా ఫ్యామిలీ ఆడియన్స్‌తో పాటు యూత్‌ను కూడా ఆకట్టుకుని బాక్సాఫీస్ వద్ద సక్సెస్‌ఫుల్ రన్‌ను కొనసాగించింది. కామెడీ, రొమాన్స్, ఫ్యామిలీ ఎమోషన్స్ మేళవింపుగా తెరకెక్కిన ఈ చిత్రానికి దర్శకుడు రామ్ అబ్బరాజు తనదైన స్టైల్‌లో ట్రీట్‌మెంట్ ఇచ్చి ప్రేక్షకుల నుంచి ప్రశంసలు అందుకున్నారు. థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శన పూర్తి చేసుకున్న ఈ మూవీ తాజాగా ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్‌కు వచ్చింది. డిజిటల్ రిలీజ్ అయిన కొద్ది రోజులకే ఈ సినిమా ప్రైమ్ వీడియో ఇండియా ట్రెండింగ్ చార్ట్స్‌లో నంబర్ వన్ స్థానాన్ని దక్కించుకోవడం విశేషం. సాధారణంగా పెద్ద స్టార్ సినిమాలు లేదా భారీ బడ్జెట్ చిత్రాలకే ఓటీటీలో ఈ స్థాయి ఆదరణ దక్కుతుంటుంది. అయితే ఒక మీడియం రేంజ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇంత తక్కువ సమయంలో టాప్ పొజిషన్‌కు చేరుకోవడం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ చిత్రాన్ని అనిల్ సుంకర నిర్మించగా, శర్వానంద్ సరసన సంయుక్త మీనన్ మరియు సాక్షి వైద్య హీరోయిన్లుగా నటించారు. వారి కెమిస్ట్రీ, సరదా సన్నివేశాలు, పాటలు సినిమాకు అదనపు బలంగా నిలిచాయి. అలాగే సీనియర్ నటుడు నరేష్, సిరి హనుమంతు, సుదర్శన్, సంపత్ రాజ్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించి కథకు బలం చేకూర్చారు. ముఖ్యంగా కామెడీ ట్రాక్ ప్రేక్షకులను విపరీతంగా అలరించిందనే అభిప్రాయాలు వ్యక్తమ య్యాయి. ఇక ఓటీటీలో ఈ సినిమా తెలుగుతో పాటు తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో కూడా అందుబాటులో ఉండటం వల్ల అన్ని భాషల ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. ఫ్యామిలీతో కలిసి చూడదగ్గ క్లీన్ ఎంటర్‌టైనర్‌గా పేరుపొందిన 'నారీ నారీ నడుమ మురారి' డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో కూడా అదే జోరును కొనసాగిస్తూ శర్వానంద్ కెరీర్‌లో మరో హిట్‌గా నిలుస్తోంది.

# ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ మృత్యుంజయ్



శ్రీవిష్ణు కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'మృత్యుంజయ్' ఈ నెల 27న ప్రేక్షకుల ముందుకురానుంది. ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రానికి హుస్సేన్ షా కిరణ్ దర్శకత్వం వహించారు. సందీప్ గుణ్ణం, వినయ్ చిలపాటి నిర్మాతలు. రేబా జాన్ కథానాయికగా నటిస్తున్నది. రిలీజ్ డేట్‌ను అనౌన్స్ చేస్తూ కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. సరికొత్త కథ, కథనాలతో సాగే ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ ఇదని, శ్రీవిష్ణు పాత్ర కొత్త పంథాలో ఉంటుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: విద్యాసాగర్, సంగీతం: కాలభైరవ, దర్శకత్వం: హుస్సేన్ షా కిరణ్.



### యాక్షన్ మోడ్‌లో

# కేరళ భామ

ఇన్నాళ్లూ అందం, అభినయంతో ఆకట్టుకున్న మలయాళమందారం సంయుక్త మీనన్ ఇప్పుడు యాక్షన్ మోడ్‌లోకి మారింది. ప్రస్తుతం ఆమె 'ది బ్లాక్ గోల్డ్' అనే లేడీ ఓరియెంటెడ్ పానిండియా యాక్షన్ డ్రామాలో నటిస్తున్న విషయం విదితమే. ఈ సినిమాలోని యాక్షన్ సీక్వెన్స్‌ని ఆమె డూప్ లేకుండా చేస్తూ చిత్రయూనిట్‌ని ఆశ్చర్యానికి లోను చేస్తున్నది. ఈ విషయాన్ని గురువారం ఓ ప్రకటన ద్వారా చిత్రయూనిట్ తెలియజేశారు.

గాయాలను సైతం పట్టించుకోకుండా సంయుక్త చేస్తున్న పోరాటాలు ఈ సినిమాకే హైలైట్‌గా నిలుస్తాయని, సంయుక్త కెరీర్‌లోనే ఈ సినిమా ప్రత్యేకంగా నిలువనున్నదని ప్రకటనలో వారు పేర్కొన్నారు. ఈ సమ్మర్‌లోనే తెలుగుతోపాటు తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో పానిండియా స్థాయిలో విడుదల కానున్న ఈ చిత్రంలో నాజర్, మురళీశర్మ, రావు రమేశ్, మనీష్ వాద్వా కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి యోగేష్ కెఎంసి దర్శకుడు. మాగంటి పిక్చర్స్‌తో కలిసి హాస్య మూవీస్ పతాకంపై రాజేష్ దండా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

# మైత్రీ బ్యానర్‌లో నవీన్ పోలిశెట్టి క్రేజీ ప్రాజెక్ట్



'అనగనగా ఒక రాజు' చిత్రంతో మొదటిసారి రూ.100 కోట్ల క్లబ్‌లో చోటు దక్కించుకున్నాడు టాలీవుడ్ యంగ్ అండ్ ఎనర్జిటిక్ స్టార్ నవీన్ పోలిశెట్టి. ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ.100 కోట్ల గ్రాస్ వసూళ్లను సాధించి సరికొత్త రికార్డు సృష్టించింది. ఈ విజయంతో నవీన్ పోలిశెట్టి తన కెరీర్‌లో తొలి వంద కోట్ల మైలురాయిని అందుకున్న నటుడిగా నిలిచారు. అయితే ఈ అద్భుతమైన విజయంతో ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ స్పందిస్తూ నవీన్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపింది. ఈ సందర్భంగా తమ తదుపరి ప్రాజెక్ట్‌లో నవీన్ భాగమవుతుండడంతో ఈ సినిమా కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు ప్రకటించింది. అయితే మైత్రీ బ్యానర్‌లో రాబోతున్న ఈ చిత్రం ఎలా ఉండబోతుందని ప్రేక్షకులకు ఎదురుచూస్తున్నారు.



### అలా జరగాలని

# కోరుకోండి!

అల్లు అర్జున్ కథానాయకుడిగా అట్లీ దర్శకత్వంలో సైన్స్ ఫిక్షన్ చిత్రం తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. పునర్జన్మలతో ముడిపడిన ఈ కథలో అల్లు అర్జున్ ద్విపాత్రాభినయంలో కనిపిస్తారని సమాచారం. ఈ సినిమాలో కథానాయికగా దీపికా పడుకోన్ నటిస్తున్నది. కీలకమైన అతిథి పాత్రలో మృణాల్ ఠాకూర్ కనిపించనుందని ప్రచారం జరుగుతున్నది. ఈ భామ ఇప్పటికే షూటింగ్‌లో కూడా పాల్గొంటున్నదని వార్తలొచ్చాయి. వీటిపై తాజా ఇంటర్వ్యూలో స్పందించింది మృణాల్ ఠాకూర్. అల్లు అర్జున్–అట్లీ ఈ సినిమాలో మీ పాత్ర ఎలా ఉండబోతున్నది? అని ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు మృణాల్ బదులిచ్చింది. 'నిజంగా నేను ఆ సినిమాలో నటిస్తున్నానా? అలాంటి అద్భుతం జరగాలని మీరు ప్రార్థించండి. ఒకవేళ ఈ వార్త నిజమైతే మనందరం సెలబ్రేట్ చేసుకుందాం' అంటూ కాస్త వ్యంగ్యంగా సమాధానమిచ్చింది. దీంతో ఈ పాన్ వరల్డ్ ప్రాజెక్ట్‌లో మృణాల్ ఠాకూర్ ఇంకా ఖరారు కాలేదని, ఇప్పటివరకు వచ్చిన వార్తలన్నీ పుకార్లేనని తేలిపోయింది. అయితే రెండో నాయిక పాత్ర కోసం జాన్వీకపూర్‌తో పాటు మృణాల్ పేరును చిత్ర బృందం పరిశీలిస్తున్నదని ఫిల్మ్‌నగర్ టాక్.

## ఘనంగా బీసీ కమిషన్ సభ్యురాలు
# బాల లక్ష్మి జన్మదిన వేడుకలు



**ఉప్పల్ ( ప్రశ్న న్యూస్)** తెలంగాణ బీసీ కమిషన్ సభ్యులు బాల లక్ష్మి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ మెదక్, ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేసిన ప్రసన్న హరికృష్ణ, తెలంగాణ రాష్ట్ర జర్నలిస్టు సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ రాష్ట్ర కోఆర్డినేటర్ కీర్తి సంతోష్ రాజ్, ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ ముదిరాజ్, అడ్వకేట్ రాము, యమ గాని సత్యం గౌడ్, దుద్దుల సతీష్ గౌడ్, తదితరులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ప్రసన్న హరికృష్ణ మాట్లాడుతూ బీసీల రాజ్యాధికారం కోసం అందరం ఏకతాటి పైకి రావాలని, మున్సిపల్ ఎన్నికల్లో బీసీ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉన్నదని ఈ సందర్భంగా అన్నారు.

# భక్తుల దాహం తీరాలనే దాతృత్వం

- మహాశివరాత్రికి రూ.45 వేలతో నీటి సేవకు జువ్వాడి దంపతుల చేయూత
- రూ.45 వేలు విరాళం అందజేత - ట్రస్ట్ సభ్యుల హర్షం - కృతజ్ఞతలు



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** మహాశివరాత్రి సందర్భంగా రాజన్న దర్శనానికి వచ్చే భక్తుల దాహం తీరాలనే ఉద్దేశంతో డాక్టర్ జువ్వాడి వెంకటేశ్వరరావు -- స్నేహలత దంపతులు మరోసారి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మినరల్ వాటర్ బాటిల్స్ పంపిణీ కోసం రూ.45 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు.ఈ విరాళంతో సుమారు 10 వేల వాటర్ బాటిల్స్‌ను భక్తులకు అందించనున్నట్లు ట్రస్ట్ నిర్వాహకులు డాక్టర్ మధు మహేష్ తెలిపారు. గత నాలుగేళ్లుగా మహాశివరాత్రి సందర్భంగా ఈ సేవను నిరంతరంగా కొనసాగిస్తూ వస్తున్నారని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ట్రస్ట్ నిర్వాహకులు మధు మహేష్ మాట్లాడుతూ, డాక్టర్ జువ్వాడి దంపతులు ట్రస్ట్‌కు శాశ్వత అన్నదాన సభ్యులుగా మాత్రమే కాకుండా ప్రతి సేవా కార్యక్రమంలోనూ భాగస్వామ్యం అవుతున్నారని తెలిపారు. కరోనా కాలం నుంచి ట్రస్ట్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలకు వారి సహకారం నిలకడగా ఉందన్నారు.ప్రభుత్వ ఆసుపత్రికి ఐ టెస్టింగ్ యంత్రం అందించడం, పర్యావరణ పరిరక్షణ కోసం వేలాది జూట్ బ్యాగ్స్ పంపిణీ, పేద విద్యార్థులకు విద్యాసహాయం, పాఠశాల విద్యార్థులకు బ్యాగ్స్--నోట్‌బుక్స్, పేదింటి ఆడపిల్లల పెళ్లిళ్లకు సాయం వంటి అనేక కార్యక్రమాల్లో వారి దాతృత్వం కొనసాగుతోందని వివరించారు.భక్తసేవే భగవంతుని సేవ అన్న భావనతో జువ్వాడి దంపతులు చేస్తున్న సహాయం సమాజానికి ఆదర్శమని కొనియాడారు.

# అభివృద్ధి దిశగా సర్పంచుల పరస్పర చర్చలు

- విలాసాగర్‌లో సర్పంచ్ అనుముల భాస్కర్ కు ఘన సన్మానం



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని విలాసాగర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. విలాసాగర్ సర్పంచ్ ఏనుగుల కనుకయ్య ఆధ్వర్యంలో నీలోజిపల్లి గ్రామ సర్పంచ్ అనుముల భాస్కర్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు.గ్రామాభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన చేస్తున్న సేవలను అభినందిస్తూ ఈ సన్మానం చేసినట్లు తెలిపారు.

ఈ సందర్భంగా ఇద్దరు సర్పంచులు పరస్పరం తమ గ్రామాల అభివృద్ధి కోసం చేపడుతున్న కార్యక్రమాలు, అమలు చేస్తున్న పథకాలపై కాసేపు చర్చించుకున్నారు. గ్రామాల అభివృద్ధికి పరస్పర సహకారం అవసరమని అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు కొనుకటి నాగయ్య,సెంచు సంపత్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## సంక్షేమం కోసం వార్డు సభ్యుల
# కమిటీలు త్వరలో ఏర్పాటు

- రాష్ట్రవ్యాప్తంగా పర్యటనలు చేపడతాం
- తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు : అతికం రాజశేఖర్ గౌడ్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో త్వరలో వార్డు సభ్యుల కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు తెలంగాణ వార్డు సభ్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు, న్యాయవాది అతికం రాజశేఖర్ గౌడ్ తెలిపారు.శుక్రవారం హైదరాబాద్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా వార్డు సభ్యుల సంక్షేమం కోసం నిరంతరం పోరాడే వారికి సంఘం ద్వారా మరిన్ని అవకాశాలు కల్పిస్తామని అన్నారు. వార్డు సభ్యుల హక్కులు, సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ కట్టుబడి పనిచేయాలని పిలుపునిచ్చారు.రానున్న రోజుల్లో వార్డు సభ్యుల సమస్యలు తెలుసుకోవడానికి రాష్ట్రవ్యాప్తంగా పర్యటనలు నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి బత్తిని అనిల్ గౌడ్‌తో పాటు పలువురు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## నిజామాబాద్ జిల్లాపై వరాల జల్లు
# కురిపించిన సీ.ఎం రేవంత్ రెడ్డి

- తెలంగాణాను దేశంలోనే నెంబర్ వన్ గా తీర్చిదిద్దడమే ధ్యేయం - ఆదరిస్తే మరింతగా అభివృద్ధి చేసి చూపిస్తాం
- నిజామాబాద్ బహిరంగ సభలో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి
- విధి నిర్వహణలో అమరులైన కానిస్టేబుళ్లు సౌమ్య, ప్రమోద్ కుటుంబాలకు రూ. కోటి చొప్పున ఎక్స్ గ్రేషియా చెక్కుల అందజేత
- డ్వాక్రా సంఘాలకు రూ. 200 కోట్ల రుణాలు పంపిణీ - రూ. 700 కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు






**నిజామాబాద్(ప్రశ్న న్యూస్)** అన్ని కులాలు, అన్ని మతాల వారికి సమ ప్రాధాన్యతనిస్తూ, తెలంగాణాను అన్ని రంగాలలో దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా ముందుకువెళు తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. తమ ప్రభుత్వాన్ని ఆదరిస్తే మరింతగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తామని అన్నారు. అధికారం చేపట్టిన రెండేళ్ళ కాలంలోనే 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని, ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా కొలువుల జాతరను కొనసాగించామని గుర్తు చేశారు. నిజామాబాద్ జిల్లా డిచ్పల్లి మండలం బర్దీపూర్ శివారులో శుక్రవారం నిర్వహించిన ప్రజా పాలన -- ప్రగతి బాట బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. హైదరాబాద్ నుండి హెలికాప్టర్ లో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావులతో కలిసి ముఖ్యమంత్రి సాయంత్రం 4.00 గంటల సమయానికి బర్దీపూర్ చేరుకోగా, హెలిప్యాడ్ వద్ద ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డి, షబ్బీర్ అలీ, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యే భూపతిరెడ్డి, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావి, ఇతర ప్రజాప్రతినిధులు సీ.ఎంకు పుష్పగుచ్చాలు అందించి ఘన స్వాగతం పలికారు. తెలంగాణ యూనివర్సిటీలో రూ. 20 కోట్ల అంచనా వ్యయంతో వేర్వేరుగా నిర్మించనున్న ఎస్సీ బాలుర, బాలికల హాస్టళ్ల నిర్మాణ పనులకు సీ.ఎం శంకుస్థాపన చేశారు. అలాగే, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్, ఇందల్‌వాయి లో సిబ్బంది నివాస గృహాలు (స్టాఫ్ క్వార్టర్స్), అదనపు సౌకర్యాల నిర్మాణానికి సంబంధించిన పనులకు, రూ.600 కోట్లతో ఆర్మూర్, బోధన్, నిజామాబాద్ రూరల్ అసెంబ్లీ నియోజకవర్గాలలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణాలకు, తెలంగాణ యూనివర్సిటీలో రూ. 1.36 కోట్లతో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి, రూ.43 కోట్లతో ఆడిటోరియం, పరిపాలనా భవనం (అడ్మిన్ బిల్డింగ్), సీఎస్ఈ భవనం విస్తరణకు సంబంధించిన పనులకు, రూ. 21 కోట్లతో రోడ్ల నిర్మాణం, విస్తరణ తదితర పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపనలు చేశారు. అదేవిధంగా తెలంగాణ యూనివర్సిటీలో రూ. 18 కోట్లను వెచ్చిస్తూ నూతనంగా నిర్మించిన సైన్స్ ల్యాబ్ కు ప్రారంభోత్సవం చేశారు. 1614 స్వయం సహాయక సంఘాలకు బ్యాంక్ లింకేజీ కింద రూ. 200 కోట్ల విలువ చేసే చెక్కును పంపిణీ చేశారు. విధి నిర్వహణలో మృతి చెందిన ఎక్సైజ్ కానిస్టేబుల్ గాజుల సౌమ్య, సీ.సీ.ఎస్ కానిస్టేబుల్ ప్రమోద్ కుమార్ కుటుంబాలకు రూ. కోటి చొప్పున ఎక్స్ గ్రేషియా చెక్కులను సీ.ఎం రేవంత్ రెడ్డి తన చేతుల మీదుగా అందజేశారు.ఈ సందర్భంగా బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, ఎన్నో ప్రత్యేకతలు కలిగిన నిజామాబాద్ జిల్లా అంటే తనకు ప్రత్యేక అభిమానమని అన్నారు. నిజామాబాద్ గడ్డ మీద నుండే ప్రజాకవి దాశరథి నా తెలంగాణా కోటి రతనాల వీణ అని నినదించారని గుర్తు చేశారు. ఇదే జిల్లా నుండి ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, మాజీ మంత్రి మండవ వెంకటేశ్వర్ రావు వంటి నిజాయితి కలిగిన మచ్చ లేని నాయకులు ఉన్నారని అన్నారు. రాష్ట్రంలో 10 సంవత్సరాలు, కేంద్రంలో 12 సంవత్సరాలుగా అధికారంలో కొనసాగిన గత పాలకులు నిజామాబాద్ జిల్లా అభివృద్ధిని పూర్తిగా విస్మరించాయని సీ.ఎం రేవంత్ రెడ్డి దుయ్యబట్టారు. అందుకే 1931 సంవత్సరంలోనే నిజామాబాద్ మున్సిపాలిటీగా ఏర్పాటైనప్పటికీ, స్మార్ట్ సిటీగా గుర్తింపు దక్కలేదని ఆవేదన వెలిబుచ్చారు. ఈ విషయమై స్థానిక పార్లమెంటు సభ్యుడు కేంద్రంపై ఎందుకు ఒత్తిడి తేవడం లేదని ప్రశ్నించారు. తమ ప్రభుత్వాన్ని ఆదరిస్తే నిజామాబాద్ ఉమ్మడి జిల్లాను అన్ని రంగాలలో ప్రగతి బాట పట్టిస్తామని సీ.ఎం స్పష్టమైన హామీ ఇచ్చారు. ఈ జిల్లాకు చెందిన దివంగత నేత డి.శ్రీనివాస్ పీ.సీ.సీ అధ్యక్షుడిగా, వైఎస్ రాజశేఖర్ రెడ్డి సీఎల్పీ నేతగా ఉంటూ తమ పార్టీని రెండు పర్యాయాలు వరుసగా అధికారంలోకి తెచ్చారని గుర్తు చేశారు. ప్రస్తుతం మహేష్ కుమార్ గౌడ్ సారథ్యం, తన నాయకత్వంలో రానున్న 2029 ఎన్నికల్లోనూ ప్రజా ప్రభుత్వమే వరుసగా అధికారంకి వస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. త్వరలో జరుగనున్న మున్సిపల్ ఎన్నికల్లో నిజామాబాద్ కార్పోరేషన్ సహా, ఉమ్మడి జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలను కైవసం చేసుకుంటామనడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. గత రెండేళ్ళ కాలంలోనే ఉమ్మడి జిల్లాలోని మున్సిపల్ పట్టణాల అభివృద్ధి కోసం రూ.1045 కోట్ల నిధులను కేటాయించామని, రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నగరాలు, మున్సిపల్ పట్టణాలకు 17,400 కోట్ల రూపాయల నిధులను మంజూరు చేశామని సీ.ఎం వెల్లడించారు. అయితే తమ ప్రభుత్వానికి ఎక్కడ మంచి పేరు వస్తుందోననే భయంతో మెజారిటీ బల్దియాలలో మేయర్లు, చైర్మన్లుగా కొనసాగిన ప్రతిపక్ష పార్టీల వారు ఆ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టకుండా ప్రగతిని అడ్డుకున్నారని ఆక్షేపించారు. ఇప్పుడు ప్రజలకు మంచి అవకాశం వచ్చిందని, మున్సిపల్ ఎన్నికలలో ప్రజా ప్రభుత్వాన్ని ఆదరిస్తే పట్టణాలు, నగరాలను మరింతగా అభివృద్ధి చేసేందుకు నూటికి నూరు శాతం ప్రభుత్వం కంకణబద్ధమై కృషి చేస్తుందని సీ.ఎం రేవంత్ రెడ్డి భరోసా కల్పించారు. నిజామాబాద్ జిల్లాకు ఎయిర్ పోర్ట్ తెస్తామని, ప్రాణహిత-చేవెళ్ళ 21(ఎ) ప్యాకేజీ పనులను పూర్తి చేయించి 2లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందిస్తామని హామీ ఇచ్చారు. మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం వసతి కల్పిస్తూ ప్రభుత్వం ఆర్టీసీ సంస్థకు రూ. 9వేల కోట్లు చెల్లించిందని, మహిళా సంఘాలకు వెయ్యి అద్దె బస్సులు అందించామని గుర్తు చేశారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనప్పటికీ ఉచిత విద్యుత్, రాయితీపై రూ. 500 లకే వంట గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, 3.17 కోట్ల మందికి ప్రతీ నెల సన్న బియ్యం పంపిణీ, రైతులకు మద్దతు ధరతో పాటు సన్నాలకు క్వింటాకు 500 చొప్పున బోనస్ తదితర వాటిని అమలు చేస్తున్నామని అన్నారు. ఇదివరకు జిల్లాలో కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో నిర్మించిన ప్రాజెక్టుల వల్లనే రైతులు పంటలు పండిస్తూ ఆత్మగౌరవంతో జీవనాలు వెళ్లదీస్తున్నారని అన్నారు. తనపై ప్రతిపక్ష పార్టీల నాయకులు ఎన్ని లేనిపోని విమర్శలు చేసినా పట్టించుకోనని, అన్ని కులాలు, మతాలను సమన్వయము చేస్తూ తెలంగాణా రాష్ట్రాన్ని అభివృద్ధి పరంగా నెంబర్ వన్ గా తీర్చిదిద్దడమే ప్రధాన సంకల్పంతో ముందుకు సాగుతున్నామని స్పష్టం చేశారు. బహిరంగ సభలో వివిధ కార్పోరేషన్ల చైర్మన్లు తాహెర్ బిన్ హందాన్, మానాల మోహన్ రెడ్డి, అన్వేష్ రెడ్డి, నుడా చైర్మన్ కేశ వేణు,రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ళ శారద, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, మాజీ ఎమ్మెల్సీలు ఆకుల లలిత, అర్కల నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మూలికా వనంలో ఔషధ మొక్కలపై అవగాహన సదస్సు







**హైదరాబాద్(ప్రశ్న న్యూస్)** నగర శివార్లలోని అజీజ్ నగర్ మూలికా వనంలో ఔషధ మొక్కల గుర్తింపు, వాటి వినియోగంపై ప్రత్యక్ష అవగాహన సదస్సు (లైవ్ డెమోన్స్ట్రేషన్) అత్యంత వైభవంగా నిర్వహించబడింది. ఆయుర్వేద పరంపర మూలిక వైద్య మహా సంఘం, ఆల్ హెర్బల్ ట్రెడిషనల్ ప్రాక్టీషనర్ ఆర్గనైజేషన్, ఆల్ ఇండియా యునాని తిబ్బి కాంగ్రెస్ (తెలంగాణ రాష్ట్ర విభాగం) సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పారంపర్య వైద్యులు, ప్రకృతి ప్రేమికులు, వివిధ కళాశాలల నుండి సుమారు 100 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సదస్సుకు రిటైర్డ్ ఆయుర్వేదిక్ డైరెక్టర్, ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల మాజీ ప్రిన్సిపాల్ కొండపల్లి నరసింహారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి, వనమూలికల విశిష్టతను క్షుణ్ణంగా వివరించారు. గంటల తరబడి మొక్కల గుర్తింపు, వాటి ఔషధ గుణాలు, చికిత్సా విధానాలపై ఆయన అందించిన వివరణ సభికులను విశేషంగా ఆకట్టుకుంది. ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జకోటియా తమ అనుభవాలను పంచుకుంటూ అనేక ఆయుర్వేద యోగాలను వివరించారు.సి.జి.ఆర్ వ్యవస్థాపక అధ్యక్షులు లక్ష్మారెడ్డి, లీలా లక్ష్మారెడ్డి ఈ సదస్సులో పాల్గొని స్ఫూర్తిదాయక ప్రసంగాలు చేశారు. పర్యావరణ పరిరక్షణలో జీవవైవిధ్యం కాపాడటంలో ఔషధ మొక్కల పాత్ర కీలకమని వారు పేర్కొన్నారు. పారంపర్య వైద్యులు చేస్తున్న ఇటువంటి సామాజిక సేవలను వారు అభినందించారు. ఈ కార్యక్రమ నిర్వాహకులు సింహాచలం లక్ష్మణస్వామి, ఎండి. రఫీయుద్దీన్, ఆల్ ఇండియా యునాని తిబ్బి కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఏ.ఏ. ఖాన్ మాట్లాడుతూ మూలికా వనంలో ఇది తమ మూడవ కార్యక్రమమని, భవిష్యత్తులో మూడు సంస్థల సమన్వయంతో మరిన్ని సదస్సులు నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమ విజయానికి ఆర్థిక సహకారం అందించిన ఎండి. అఫ్జరికి ఇతర సహకారులకు వారు ధన్యవాదాలు తెలియజేశారు. సదస్సులో పాల్గొన్న విద్యార్థులకు, అభ్యాసకులకు సంస్థల తరఫున ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సర్టిఫికెట్లు తమ ఉపాధి, విద్యావకాశాలకు ఎంతో తోడ్పడతాయని విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. అంతరించిపోతున్న అరుదైన మూలికలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని సదస్సులో తీర్మానించారు.

# వార్డు సభ్యుల సమస్యల పరిష్కార దిశగా పని చేస్తా

## - రాష్ట్ర కార్యవర్గ సభ్యులు :-సాంబయ్య గౌడ్

- వార్డు సభ్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నాగుల సాంబయ్య గౌడ్ నియామకం

**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని వరదవెల్లి గ్రామ పంచాయతీ వార్డు సభ్యుడు నాగుల సాంబయ్య గౌడ్‌ను తెలంగాణ రాష్ట్ర వార్డు సభ్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమించారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షులు, న్యాయవాది అతికం రాజశేఖర్ గౌడ్ శుక్రవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు.ఈ సందర్భంగా నాగుల సాంబయ్య గౌడ్ మాట్లాడుతూ వార్డు సభ్యుల సంక్షేమమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వార్డు సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.తన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షులు అతికం రాజశేఖర్ గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెస్రం నర్సయ్యలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అలాగే సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని, త్వరలోనే రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో నూతన కమిటీలను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.



# ఎం-ప్యానల్ లేకుండా అక్రిడేషన్ నోటిఫికేషనా.?

- జర్నలిస్టులపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎందుకు ఈ చిన్నచూపు.?
- అర్హత ఉన్న అన్ని పత్రికలను వెంటనే ఎం--ప్యానల్ చేయాలి
- నిజమైన జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డ్ ఇవ్వకుంటే ఉద్యమిస్తాం: టీజేఎస్ఎస్
- పెద్ద పత్రికలకు ఒక్కరోజు ఇచ్చే అడ్వటైజ్మెంట్లతో వందల్లో చిన్న పత్రికలు బాగుపడతాయి
- రిపోర్టర్ల పై సమాచార శాఖ మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి కక్ష కట్టారా.?

**హైదరాబాద్(ప్రశ్న న్యూస్)** రాష్ట్రంలో అర్హత ఉన్న పత్రికలను ఎం-ప్యానల్ చేయకుండానే అక్రిడేషన్‌కు అప్లై చేసుకోవాలని నోటిఫికేషన్ ఇవ్వడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఇది కేవలం పరిపాలనా నిర్ణయమా.? లేదా చిన్న పత్రికలు, నిజమైన రిపోర్టర్లను పక్కన పెట్టే కుట్రానా.? అనే ప్రశ్నలు తీవ్రంగా వినిపిస్తున్నాయని జర్నలిస్టు సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఎన్నికల ముందు మీడియా, ముఖ్యంగా చిన్న పత్రికలు, ఫీల్డ్ రిపోర్టర్లు కాంగ్రెస్‌కు అండగా నిలిచారు. ప్రజా సమస్యలను ముందుకు తీసుకెళ్లారు. టిఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. అలాంటి జర్నలిస్టులే ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనగదొక్కబడుతున్నారా.? అంటే కాంగ్రెస్ ప్రభుత్వం రిపోర్టర్లను పూర్తిగా పక్కన పెట్టేయడం జరుగుతుందన్నారు.

### ఎం-ప్యానల్ లేకుండా అక్రిడేషన్ అంటే ఎవరికీ లాభం.?

ఎం-ప్యానల్ అనేది కేవలం ఒక అధికారిక ప్రక్రియ కాదు. పత్రిక నిజమైనదా.? క్రమం తప్పకుండా ప్రచురణ జరుగుతుందా.? ఫీల్డ్‌లో పని చేసే రిపోర్టర్లు ఉన్నారా.? ప్రజా సమస్యలపై కథనాలు వస్తున్నాయా.? ఈ విషయాలన్నిటిని డిపిఆర్వోలు ఐ అండ్ పి ఆర్ పర్యవేక్షించాలి. కానీ వాళ్ళ పర్యవేక్షణ ఎక్కడ.?జిల్లా డిపిఆర్ఓ ల వద్ద జిల్లాలో పనిచేసే రిపోర్టర్ల సమాచారం ఉందా.? ఎం పానెల్ చేయకుండా అక్రిడేషన్ ఇస్తే పేపర్ మీద మాత్రమే ఉన్న పత్రికలు, అధికార పార్టీకి అనుకూలంగా పనిచేసే బినామీ మీడియా సంస్థలకే దారితీయదా.?దీని వల్ల నిజంగా రోడ్డెక్కి వార్తలు తెచ్చే గ్రౌండ్ రిపోర్టర్లు తీవ్రంగా నష్టపోతారు. ఈ విషయం సమాచార శాఖ మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి ఎందుకు గుర్తించడం లేదు.

### చిన్న పత్రికలు అంటే సీఎం రేవంత్ రెడ్డికి గిట్టదా.?

గత కెసిఆర్ ప్రభుత్వంలో చిన్న పత్రికలకు తీవ్ర అన్యాయం జరిగిందని ప్రతిపక్షంలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలుమార్లు మీడియా ముఖంగా ప్రశ్నించారు. ప్రస్తుతం రేవంత్ సర్కార్ అధికారంలో ఉంది మరి చిన్న పత్రికలకు మీడియాకు ఎందుకు అన్యాయం చేస్తున్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చెప్పిన మాటలు అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరిచిపోయారా.? పెద్ద పత్రికలకు ఒక్కరోజు ఇచ్చే అడ్వటైజ్మెంట్ ఖర్చులలో దాదాపు చిన్న పత్రికలు అన్ని బతికి బట్ట కడతాయి. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి ఎందుకు అర్థం చేసుకోవడం లేదు అధికారంలోనికి రావడానికి చిన్న పత్రికల సహాయం కావాలి వచ్చిన తర్వాత తొక్కి వేయాలి ఇదేనా.? ఈ నిర్ణయంతో ఒక ప్రశ్న స్పష్టంగా వినిపిస్తోంది,"చిన్న పత్రికలు అంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి గిట్టదు అని" పెద్ద పత్రికలకు కోట్ల రూపాయల ప్రకటనలు, చిన్న పత్రికలకు మాత్రం ఎంపానెల్ లేదు. భరోసా లేదు. గుర్తింపు లేదు, ఇదేనా ప్రజా పాలన.? ఇదేనా కాంగ్రెస్ ప్రభుత్వం మీడియాకు ఇచ్చిన గౌరవం.?జర్నలిస్టులతోనే అధికారంలోకి వచ్చి, మీడియా స్వేచ్ఛ గురించి మాట్లాడిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఈరోజు అదే మీడియాను నియంత్రించే ప్రయత్నం చేస్తోందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### నచ్చినవారికి అక్రిడేషన్, ప్రశ్నించేవారికి నిరాకరణ..

జర్నలిస్టుల విషయంలో సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నిర్ణయాలు ప్రజాస్వామ్యానికి ప్రమాదకర సంకేతం కాదా.? మొదటగా అర్హత ఉన్న చిన్న పత్రికలకు ఏం ప్యానల్ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్న పట్టించుకోకపోవడం బాధాకరంగా మారింది.

కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ముందుగా అర్హత ఉన్న పత్రికలను వెంటనే ఎం-ప్యానల్ చేయాలి. ఆ తర్వాతే అక్రిడేషన్ ప్రక్రియ చేపట్టాలి.చిన్న పత్రికలు, నిజమైన రిపోర్టర్లకు న్యాయం చేయాలి. లేకపోతే ఇది మీడియాపై దాడిగా, స్వేచ్ఛను హరించే చర్యగా చరిత్రలో మిగిలిపోతుందని తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమ సంఘం పేర్కొంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జర్నలిస్టులను చిన్నచూపు చూడడం ద్వారా కాదువారికి గౌరవం ఇవ్వడం ద్వారా మాత్రమే ప్రభుత్వం బలపడుతుందని టీజేఎస్ఎస్ సూచించింది.



# ఇప్పుడు కాక ఇంకెప్పుడు.?

## బీఆర్ఎస్ నేతలకు ఈసారి కూడా కేసీఆర్ షాకిచ్చారుగా.?

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ మున్సిపల్ ఎన్నికల సమయంలోనూ బయటకు రావడం లేదు. మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి ఆయన దూరంగా ఉన్నారు. పంచాయతీ ఎన్నికల సమయంలో కూడా ప్రచార బాధ్యతను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావులపైనే పార్టీ అభ్యర్థుల గెలుపు ను ఉంచారు. కానీ అనుకున్నంత స్థాయిలో విజయం రాలేదు. పార్లమెంటు ఎన్నికల సమయంలోనే కేసీఆర్ బయటకు వచ్చారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. అప్పుడు ఒక్క పార్లమెంటు స్థానంలోనూ బీఆర్ఎస్ గెలవలేదు. తర్వాత జరిగిన ఏ ఎన్నికల ప్రచారానికి కేసీఆర్ దూరంగానే ఉన్నారు. కంటోన్మెంట్, జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల సమయంలోనూ ఆయన ప్రచారానికి రాలేదు.

### ప్రచారానికి వస్తే.. తమ గెలుపు..

ఇప్పుడు 116 మున్సిపాలిటీలు, ఏడు కార్పొరేషన్లకు ఎన్నికలు జరుగుతున్నాయి. బీఆర్ఎస్ తన అభ్యర్థులను కూడా బరిలోకి దింపింది. బీఆర్ఎస్ తరుపున పోటీ చేసిన అభ్యర్థులు తమ పార్టీ అధినేత కేసీఆర్ ప్రచారానికి వస్తే తమ గెలుపు సులువవుతుందని నమ్ముతున్నారు. కేసీఆర్ ప్రసంగాలు తమ గెలుపునకు దోహదపడతాయని భావించారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఎన్నికలు కావడంతో పాటు దాదాపు అన్ని జిల్లా కేంద్రాలకు పట్టుకొమ్మలుగా ఉన్న కార్పొరేషన్లకు కూడా ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ నెల 11వ తేదీన పోలింగ్ జరగనుంది. ప్రచారానికి గడువు మరికొద్ది రోజులు మాత్రమే సమయం ఉంది. అయినా కేసీఆర్ ప్రచారానికి రాకపోవడంపై బీఆర్ఎస్ శ్రేణులు నిరాశలో ఉన్నాయి.

### ఇప్పుడు రాకుండా..

కేసీఆర్ ప్రచారానికి ఎందుకు రావడం లేదో తమకు అర్థం కావడం లేదని గులాబీ శ్రేణులు ప్రశ్నిస్తున్నాయి. ఎన్నికలను సీరియస్ గా తీసుకోకుండా కేవలం శాసనసభ ఎన్నికల సమయానికి వస్తే ఎలా జనం ఆదరిస్తారన్న సందేహాలు పార్టీ కార్యకర్తలు నేరుగా ప్రశ్నిస్తున్నారు.

కేటీఆర్, హరీశ్ రావులు మాత్రమే ప్రచారం చేయడం సరికాదని, పార్టీ పెద్దగా ఆయన వస్తే తమకు భరోసా ఉంటుందని భావించిన కారు పార్టీ నాయకులకు ఈసారి కూడా కేసీఆర్ ఝలక్ ఇచ్చినట్లయింది. కార్పొరేషన్,మున్సిపాలిటీలో పోటీ చేయాలంటే లక్షలు ఖర్చు పెట్టాల్సి ఉంటుంది. పార్టీ కోసం తాము ఇంత చేస్తున్నా తమ కోసం కేసీఆర్ కనీసం జిల్లాల పర్యటనకు కూడా రాకపోవడాన్ని తప్పుపడుతున్నారు.

# సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్ రావు సవాల్

## - సిగాచీ పరిశ్రమ కోటి పరిహారం ఇచ్చినట్లు నిరూపిస్తే పదవికి రాజీనామా

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** సంగారెడ్డి జిల్లాలోని సిగాచీ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఒక్క రూపాయి పరిహారం ఇవ్వలేదని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు మండిపడ్డారు. మృతుల కుటుంబాలకు ఈ ప్రభుత్వం రూ.1 కోటి పరిహారం ఇచ్చినట్లు నిరూపిస్తే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సవాల్ చేశారు. బాధిత కుటుంబాలకు సిగాచీ పరిశ్రమ మాత్రమే రూ.25 లక్షల చొప్పున ఇచ్చిందని అన్నారు. సిగాచీ కంపెనీలో 54 మంది ప్రాణాలు కోల్పోతే ప్రభుత్వం పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.1 కోటి పరిహారం ఇస్తామని చెప్పి రూపాయి ఇవ్వలేదని విమర్శించారు. హామీల పేరుతో ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఒక్క హామీని నెరవేర్చలేదని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు అని చెప్పి పురుషుల బస్సు ఛార్జీలను రెండింతలు చేశారని ఆరోపించారు. రెండేళ్ల తర్వాత మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారని, తాను మంత్రిగా వస్తానని ధీమా వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో అధికార పార్టీ డబ్బులు పంపిణీ చేస్తే తీసుకోవాలని, ఓటు మాత్రం కారు గుర్తుకు వేయాలని పిలుపునిచ్చారు. రేవంత్ రెడ్డివి వట్టి మాటలేనని అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పేదల వ్యతిరేక పార్టీ అని ధ్వజమెత్తారు.



## ప్రధాని ప్రసంగంలో పనికొచ్చే

# అంశం ఒక్కటీ లేదు

- సభలో తమకు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని ఆరోపణ



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) రాహుల్ గాంధీలో, కాంగ్రెస్ పార్టీలో సిక్కుమతంపై ద్వేషం ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలపై ఏఐసీసీ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా స్పందించారు. ప్రధానమంత్రి వ్యాఖ్యలను ఆయన ఖండించారు. ప్రధాని ప్రసంగం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని అన్నారు. గురువారం ప్రధాని మోదీ రాజ్యసభలో చేసిన ప్రసంగంలో పనికొచ్చే అంశం ఒక్కటి కూడా లేదని విమర్శించారు. మోదీ 97 నిమిషాల పాటు ప్రసంగించారని కానీ ఏమాత్రం ఉపయోగం లేని ప్రసంగం అన్నారు. రాష్ట్రపతి ప్రసంగం విషయంలో తాము చేసిన ప్రతిపాదనల్లో ఒక్క దానికి కూడా ఆయన స్పందించలేదని అన్నారు. ఆయన కేవలం 100 సంవత్సరాలు, 75 సంవత్సరాలు, 50 సంవత్సరాలు అంటూ ఏదేదో మాట్లాడారని ఎద్దేవా చేశారు. ఆర్మీ మాజీ చీఫ్ నరవణే రాసిన పుస్తకాన్ని రాహుల్ గాంధీ ప్రస్తావించగానే అధికార పార్టీ ఇబ్బంది పడిందని అన్నారు. సభలో అధికార పక్షం తమకు మాట్లాడటానికి అవకాశం ఇవ్వలేదని అన్నారు. లోక్ సభ, రాజ్యసభ ప్రజాస్వామ్యానికి రెండు స్థంభాలని, ఒక దానిలో ప్రతిపక్షాన్ని అణిచివేసి మరో సభలో మాట్లాడితే ఫలితం లేదని ఖర్గే అన్నారు. ?

## ఇస్లామాబాద్‌లో

# ఆత్మాహుతి దాడి

- 69 మంది మృతి, 169 మందికి గాయాలు



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ఆత్మాహుతి దాడి నేపథ్యంలో పాకిస్థాన్ ప్రభుత్వం ఇస్లామాబాద్‌లో ఎమర్జెన్సీ విధించింది. ఇస్లామాబాద్‌లోని షియా మసీదును లక్ష్యంగా చేసుకుని ఆత్మాహుతి దాడి జరిగింది. ఈ దాడిలో మృతుల సంఖ్య 69కి చేరగా, 169 మంది గాయపడ్డారు. నగరంలోని షెహ్జాద్ టౌన్ ప్రాంతంలో గల షియా మసీదు ప్రధాన ద్వారం వద్ద పేలుడు సంభవించింది. ఈ పేలుడు వల్ల సమీపంలోని భవనాలు, కిటికీలు కూడా పగిలిపోయాయి. పేలుడు అనంతరం నగరంలో నగరవ్యాప్తంగా ఎమర్జెన్సీని ప్రకటించినట్లు ఇస్లామాబాద్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ వెల్లడించారు. ముఖ్యమైన ప్రదేశాల్లో భద్రతా సిబ్బంది విస్తృత తనిఖీలు చేపడుతున్నారు. ఈ దుర్ఘటనలో గాయపడిన వారిని పాకిస్థాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, పాలీక్లినిక్ ఆసుపత్రికి తరలించారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఇస్లామాబాద్‌లో జరిగిన ఆత్మాహుతి దాడిని పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ ఖండించారు. ఈ ఘటన అత్యంత బాధాకరమని, పలువురు మృతి చెందారని అన్నారు. ఆత్మాహుతి దాడిని తాను తీవ్రంగా ఖండిస్తున్నానని అన్నారు.

# ఆరోసారి విశ్వవిజేతగా భారత్

- అండర్19 వరల్డ్ కప్ ఫైనల్లో ఇంగ్లండ్‌పై గ్రాండ్ విక్టరీ




న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) అండర్-19 క్రికెట్‌లో భారత యువ జట్టు మరోసారి తన ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. హరారే వేదికగా జరిగిన ప్రపంచకప్ ఫైనల్లో ఇంగ్లండ్‌పై 100 పరుగుల భారీ తేడాతో ఘనవిజయం సాధించింది. తద్వారా రికార్డుస్థాయిలో ఆరోసారి అండర్-19 ప్రపంచకప్‌ను ముద్దాడి చరిత్ర సృష్టించింది. తొలుత బ్యాటింగ్‌లో పరుగుల సునామీ సృష్టించి, ఆపై బౌలింగ్‌లో అద్భుతంగా రాణించి ఇంగ్లండ్‌ను ఆలౌట్ చేసింది. భారత్ నిర్దేశించిన 412 పరుగుల భారీ లక్ష్యఛేదనలో ఇంగ్లండ్ ఆరంభం నుంచే దూకుడుగా ఆడింది. బెన్ డాకిన్స్ (66), బెన్ మేయస్ (45) వేగంగా పరుగులు సాధించారు. అయితే, భారత బౌలర్లు కీలక సమయాల్లో వికెట్లు తీసి ఇంగ్లండ్‌ను దెబ్బకొట్టారు. ఒక దశలో 177 పరుగులకే 7 వికెట్లు కోల్పోయి ఓటమి అంచున నిలిచింది. ఈ సమయంలో కాలెబ్ ఫల్కనర్ (67 బంతుల్లో 115) ఆకాశమే హద్దుగా చెలరేగాడు. 9 ఫోర్లు, 7 సిక్సర్లతో అద్భుత శతకం బాది ఒంటరి పోరాటం చేశాడు. అతనికి జేమ్స్ మింటో (28) నుంచి కొంత సహకారం లభించినా, అది గెలుపునకు సరిపోలేదు. భారత బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు తీయడంతో ఇంగ్లండ్ పోరాటం 40.2 ఓవర్లలో 311 పరుగుల వద్ద ముగిసింది. భారత బౌలర్లలో ఆర్ఎస్ అంబ్రీష్ 3 వికెట్లతో సత్తా చాటగా, కనిష్క్ చౌహాన్, దీపేష్ దేవేంద్రన్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు.అంతకుముందు, టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత జట్టుకు ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ విధ్వంసకర ఆరంభాన్ని ఇచ్చాడు. కేవలం 80 బంతుల్లో 15 ఫోర్లు, 15 భారీ సిక్సర్లతో ఏకంగా 175 పరుగులు చేసి ఇంగ్లండ్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. అతని ఇన్నింగ్స్‌తో భారత్ భారీ స్కోరుకు బలమైన పునాది పడింది. కెప్టెన్ ఆయుష్ మాత్రే (53) బాధ్యతాయుతమైన అర్ధశతకంతో రాణించగా, వేదాంత్ త్రివేది (32), విహాన్ మల్హోత్రా (30), వికెట్ కీపర్ అభిగ్యాన్ కుండు (40) విలువైన పరుగులు జోడించారు. చివర్లో కనిష్క్ చౌహాన్ (20 బంతుల్లో 37 నాటౌట్) మెరుపు ఇన్నింగ్స్ ఆడటంతో టీమిండియా నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 411 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది. ఇంగ్లండ్ బౌలర్లలో జేమ్స్ మింటో 3 వికెట్లు తీశాడు. భారత్ గతంలో 2000, 2008, 2012, 2018, 2022లో అండర్-19 కప్ ను గెలిచింది. ఇప్పుడు రికార్డు స్థాయిలో ఆరోసారి కప్ సాధించి, అండర్-19 ప్రపంచకప్ చరిత్రలో తన తిరుగులేని ఆధిపత్యాన్ని మరోసారి నిరూపించుకుంది. మ్యాచ్ అనంతరం భారత ఆటగాళ్లు త్రివర్ణ పతాకాలను చేతబూని మైదానంలో సంబరాలు జరుపుకున్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588